# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | ఆదివారం 1-12-2019 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 108 | పేజీలు: 4 | వెల: రూ.1/-


### బీజేపీ వాకౌట్..

## బలపరీక్షలో నెగ్గిన ఉద్ధవ్

హైదరాబాద్, నవంబర్ 30: మహారాష్ట్ర అసెంబ్లీలో ఇవాళ జరిగిన బలపరీక్షలో ఉద్ధవ్ ఠాక్రే నెగ్గారు. సీఎం ఉద్ధవ్ ఠాక్రే తన విశ్వాసాన్ని నిరూపించుకోవాల్సి ఉన్నది. అయితే ప్రతిపక్ష బీజేపీ పార్టీ సభ నుంచి వాకౌట్ చేసింది. అక్రమంగా, రాజ్యాంగ వ్యతిరేకంగా సభ నిర్వహిస్తున్నారని మాజీ సీఎం ఫడ్నవీస్ ఆరోపించారు. ప్రోటెం స్పీకర్ నియామకం అనైతికంగా జరిగిందన్నారు. కాంగ్రెస్ నేత అశోక్ చవాన్ ఇవాళ సభలో విశ్వాస పరీక్ష తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. బీజేపీ వాకౌట్ చేసిన తర్వాత జరిగిన ఓటింగ్‌లో ఉద్ధవ్ ప్రభుత్వం నెగ్గింది. ఠాక్రే ప్రభుత్వానికి మద్దతుగా 169 ఓట్లు పోలయ్యాయి.

# నిందితులను ఉరితీయాల్సిందే

- షాద్‌నగర్ స్టేషన్ ఎదుట ఉద్రిక్తత
- స్టేషన్ ఎదుట భారీగా ఆందోళనకు దిగిన స్థానికులు
- లోనికి దూసుకొళ్లేందుకు యత్నం.. అడ్డుకున్న పోలీసులు
- స్టేషన్‌లోనే నిందితులకు వైద్య పరీక్షలు
- అందరూ సంయమనం పాటించాలని విజ్ఞప్తి చేసిన పోలీసులు
- నిందితులను కోర్టుకు తరలించేందుకు యత్నం
- అడ్డుకున్న ఆందోళన కారులతో షాద్‌నగర్‌లో ఉద్రిక్తత
- ఉరితీయండి లేదా మాకు అప్పగించండంటూ నినాదాలు

హైదారబాద్,నవంబర్30(ఆర్ఎన్ఎ): శంషాబాద్‌లో యువ పశువైద్యురాలి హత్యోదంతంపై ప్రజా సంఘాలు భగ్గుమంటున్నాయి. నిందితులకు ఉరిశిక్ష వేయాలంటూ షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్ ఎదుట ప్రజా సంఘాల నాయకులు ఆందోళనకు దిగారు. నిందితులను కఠినంగా శిక్షించాలంటూ నినాదాలు చేశారు. పోలీస్‌స్టేషన్ గేటు వద్దకు దూసుకెళ్లిన ప్రజాసంఘాల నాయకులు, స్థానికులను పోలీసులు అడ్డుకోగా.. రహదారిపై బైఠాయించి నిరసనకు దిగారు. దీంతో షాద్‌నగర్ స్టేషన్‌వద్ద ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. నిందితులను తమకు అప్పగించాలని ప్రజాసంఘాల నాయకులు గళమెత్తారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు దారి మళ్లించారు. ఈ కేసుకు సంబంధించి నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. వీరిని శనివారం ఉదయం షాద్‌నగర్ కోర్టులో హాజరుపర్చారు. ఈ సమయంలో స్థానిక ప్రజలు ఒక్కసారిగా కోర్టు ప్రాంతంలోకి దూసుకొచ్చే ప్రయత్నం చేశారు. పోలీసులు అడ్డుకోవటంతో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. కాగా నిందితులకు వైద్య పరీక్షలు నిర్వహించేందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేసినా స్థానికులు పోలీసులను అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో నిందితులను బయటకు తీసుకొచ్చే పరిస్థితి లేకుండా పోవటంతో ప్రాంతీయ ఆస్పత్రి ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిందితులకు పోలీస్‌స్టేషన్‌లోనే వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. జడ్జీలు అందుబాటులో లేకపోవడంతో నిందితులను ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ తహసీల్దార్ ఎదుట హాజరుపరిచే అవకాశాలు ఉన్నట్లు తెలిసింది. మహబూబ్‌నగర్ స్టేషన్‌కు తరలించేందుకు పోలీసులు ప్రయత్నం చేయగా స్థానికులు భారీ సంఖ్యలో స్టేషన్ వద్ద బైఠాయించారు.

వేలాదిమంది స్థానికులు, పరిసర గ్రామాల ప్రజలు తరలిరావటంతో పరిస్థితి ఉద్రిక్తగా మారింది. దీంతో పోలీసులు ప్రజలకు సంయమనం పాటించాలని సూచించినా ఫలితం లేకపోయింది. ఇదిలా ఉంటే శంషాబాద్ హత్యోదంతంపై తెలంగాణ వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. పలు జిల్లా కేంద్రాల్లో ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. యువతిని హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. 'సేవ్ గర్ల్స్, సేవ్ సొసైటీ' అంటూ నినాదాలు చేశారు. మరోవైపు శంషాబాద్‌లో పాఠశాల, కళాశాల విద్యార్థులు ర్యాలీ చేపట్టారు.

అంబేడ్కర్ విగ్రహం నుంచి పోలీస్‌స్టేషన్ మీదుగా ర్యాలీ చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించి నిందితులకు వెంటనే శిక్షించాలని నినాదాలు చేశారు.

### నిందితుల తరపున వాదించం - బార్ అసోసియేషన్ నిర్ణయం

ప్రియాంకను అత్యంత పాశవికంగా హత్యచేసిన నలుగురు నిందితుల్ని కఠినంగా శిక్షించాలంటూ తెలుగు రాష్ట్రాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. మహిళలు, కాలేజీ విద్యార్థినిలు.. ప్రజా, మహిళా సంఘాలు ర్యాలీలు చేపట్టాయి. నిందితుల్ని నడిరోడ్డులో ఉరి తీయాలంటున్నారు.. ఇటు నిందితులు ఉన్న షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ దగ్గర కూడా స్థానికులు ధర్నాకు దిగారు. నిరసనల సంగతి అలా ఉంటే మహబూబ్‌నగర్, షాద్‌నగర్ బార్ అసోసియేషన్ కీలక నిర్ణయం తీసుకుంది. నిందితుల తరపున వాదించకూడదని లాయర్లు నిర్ణయించారు. వారికి ఎలాంటి న్యాయ సహాయం అందించొద్దని తీర్మానించారు. లాయర్లు ఎవరూ వారికి సహకరించకూడదని నిర్ణయం తీసుకున్నారు. లాయర్ల నిర్ణయంపై అందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంచి నిర్ణయం తీసుకున్నారంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు.

### ప్రియాంక హత్యకేసులో ఐదో వ్యక్తి అవాస్తవం ..

సంచలనం సృష్టించిన వెటర్నరీ డాక్టర్ ప్రియాంకరెడ్డి హత్య కేసులో ఐదో వ్యక్తి ఉన్నట్టు వస్తున్న వార్తలపై పోలీసులు స్పందించారు. ఈ కేసులో ఐదో నిందితుడు ఉన్నాడన్న వార్త అవాస్తవం అన్నారు. ఈ కేసులో ఐదో వ్యక్తి ప్రమేయం లేదని శంషాబాద్ డీసీపీ ప్రకాశ్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రియాంకారెడ్డిని హత్య చేసింది నలుగురే అని ఆ నలుగురిని అరెస్ట్ చేశామని డీసీపీ వెల్లడించారు. ఈ కేసులో మరో వ్యక్తి ప్రమేయం ఉన్నట్టు వస్తున్న వార్తల్లో నిజం లేదన్నారు. పుకార్లను నమ్మొద్దని కోరారు. ప్రియాంక హత్య కేసులో నలుగురు నిందితులను ఫాస్ట్ ట్రాక్ కోర్టులో హాజరుపరుస్తామన్నారు. నిందితులకు కఠిన శిక్ష పడేలా చూస్తామన్నారు.

## నగరంలో డబుల్ బెడ్ ఇళ్లకు ఢోకా లేదు

### పేదల సంకల్పం నెరవేరుస్తాం: తలసాని

హైదరాబాద్,నవంబర్30(ఆర్ఎన్ఎ): రెండుపడకల ఇళ్ల నిర్మాణాలపై కొందరు పనిగట్టుకునిచేస్తున్న విమర్శల్లో వాస్తవం లేదని మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ అన్నారు. సిఎం కెసిఆర్ ఈ విషయంలో ధృఢవైఖరితో ఉన్నారని అన్నారు. రెండు పడకల ఇళ్ల నిర్మాణ పనులను యుద్ధ ప్రతిపాదికన ప్రారంభించామని పేర్కొన్నారు. నిరుపేదలకు గూడు కల్పించేందుకు తలపెట్టిన రెండు పడకల ఇళ్ల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయని అన్నారు. ఇప్పటికే పాలనా పరమైన అనుమతులు జారీ చేసిన ఇళ్లలో బిడ్‌లు దాఖలై,నిర్మాణాలు సాగుతున్నాయని అన్నారు. పేదలకు ఆవాసం కల్పించేందుకు ప్రభుత్వం నిర్మించనున్న రెండు పడకల ఇళ్ల పనులను యుద్ధ ప్రతిపాదికన ప్రారంభించామని ప్రకటించారు. ప్రజల కష్టాల నుంచి భవన నిర్మాణరంగ కూలీల ఉపాధిపై ప్రభావం వరకు గల ఇబ్బందులను వివరించారు. రెండు పడకల ఇళ్లపై ప్రభుత్వం, జీహెచ్‌ఎంసీ ప్రత్యేక దృష్టిసారించాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో లక్ష ఇళ్లు నిర్మించాలన్న లక్ష్యంలో సగమైనా పూర్తి చేయాలని భావిస్తున్నారు. నిర్మాణ సంస్థలు ముందుకు రాకపోవడంతో పనుల్లో కొంత జాప్యం జరిగింది. దీనిని అధిగమించేందుకు ప్రత్యామ్నా యాలనూ పరిశీలిస్తున్నారు. జీహెచ్‌ఎంసీ ఏర్పాటుచేసిన రూ.5కే భోజన కేంద్రాలను పేదలు ఆశ్రయిస్తున్నారు. దీంతో మరిన్ని కేంద్రాలను అందుబాటులోకి తీసుకుని వస్తామని మంత్రి అన్నారు.

ఈ కేంద్రాల సంఖ్యను 150కి పెంచితే రోజూ 45వేల మంది ఆకలి తీరనుంది. ఒక్కొక్కరి భోజనానికి రూ. 27.50 ఖర్చవుతుండగా.. జీహెచ్‌ఎంసీ రూ.22.50 భరిస్తోంది. వినియోగదారుడి నుంచి ఐదు రూపాయలు వసూలు చేస్తోంది. ఈ కేంద్రాల్లో ఎక్కువగా కార్మికులు భోజనం చేస్తుంటారు. ఈ కష్టకాంలో ఇది వీరికి ఆసరగా ఉందని తలసాని అన్నారు.

## స్పీకర్ శ్రీనివాస్‌రెడ్డి నిత్య విద్యార్థి



కామారెడ్డి, నవంబర్ 30: బాన్సువాడలో రూ.100 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. అనంతరం బాన్సువాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన బహిరంగ సభలో కేటీఆర్ ప్రసంగించారు. 'బాన్సువాడ నియోజకవర్గాన్ని అన్ని హంగులతో అద్భుతంగా తీర్చిదిద్దారు. బాన్సువాడలో 2వేల డబుల్ బెడ్‌రూం ఇండ్లను నిర్మిస్తున్నాం. స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఓ నిత్య విద్యార్థి. నియోజకవర్గ ప్రజలకు సేవలు అందించడమే లక్ష్యంగా స్పీకర్ పోచారం పనిచేస్తారు. సొంత పనులు చేసినంత శ్రద్ధగా స్పీకర్ పోచారం బాన్సువాడను అభివృద్ధి చేస్తున్నారని' కేటీఆర్ అన్నారు. బాన్సువాడను మున్సిపల్‌గా మార్చేందుకు కృషి చేసిన కేటీఆర్‌కు స్పీకర్ పోచారం ధన్యవాదాలు తెలిపారు. నిరుపేదలకు ఇల్లు కట్టించి ఇవ్వాలని సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని చెప్పారు. గృహ నిర్మాణానికి పట్టణంలో రూ.5.30లక్షలు, గ్రామాల్లో రూ.5 లక్షలు ఇస్తున్నారని పేర్కొన్నారు. బాన్సువాడలో ఏ ఒక్క కుటుంబం కూడా కిరాయి ఉండకుండా నిరుపేదలకు ఇండ్లు కట్టించి ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

### ఎవరు ఎవరితో కూటమి ఏర్పడినా..

## న్యాయస్థానాలకు సంబంధం ఉండదు

- ఇలాంటి విషయాలు న్యాయసమీక్ష పరిధిలోకి రావు
- మహారాష్ట్రంలో కూటమి ఏర్పాటుపై పిటీషన్‌ను తిరస్కరించిన న్యాయస్థానం

న్యూఢిల్లీ, నవంబర్30(ఆర్ఎన్ఎ) : ఎన్నికల తరువాత ఎవరు ఎవరితో కూటమి కట్టినా అది న్యాయస్థానాలకు సంబంధం ఉండదని, అలాంటి విషయాలపై పిటీషన్లు వచ్చినా స్పందిచాల్సిన అవసరం కోర్టులకు ఉండదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. మహారాష్ట్రంలో మూడు పార్టీలు కూటమిగా ఏర్పాటవడం మోసపూరిత చర్యగా ప్రకటించాలని అఖిల భారతీయ హిందూ మహాసభ నాయకుడు ప్రమోద్ జోషి సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై వాదనలు విన్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ నేతృత్వంలోని ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం పిటిషన్‌ను తోసిపుచ్చింది. న్యాయస్థానాలు ఇలాంటి విషయాల్లో తలదూర్చాల్సిన అవసరం ఏముందని పిటిషనర్ తరఫు న్యాయవాది బెయుజ్ సిన్హాని ధర్మాసనం ప్రశ్నించింది. ఎవరు ఎవరితో కూటమి ఏర్పాటు చేసినా న్యాయస్థానాలకు ఎలాంటి సంబంధం ఉండదు. వాటిపై స్పందించాల్సిన అవసరం కూడా కోర్టులకు ఉండదు. ఇలాంటి విషయాలు కోర్టుల న్యాయ సమీక్ష పరిధిలోకి రావు. కూటమిగా ఏర్పాటైన పార్టీలు వారికంటూ కొన్ని విధివిధానాలను రూపొందించుకుంటాయని, అవి బయట వ్యక్తులకు తెలియాల్సిన అవసరం లేదన్నారు. ఇది ప్రజాస్వామ్య దేశమని, ఒక పార్టీ మరో పార్టీతో పొత్తు పెట్టుకోవడం సరికాదని కోర్టులు చెప్పలేవన్నారు. రాజకీయ పార్టీల హక్కులను కాలరాసే అధికారం న్యాయస్థానాలకు ఉండదన్నారు. ఇలా కూటమి ఏర్పాటు చేయడం అనేది సరైనదా? కాదా? అనేది ప్రజలు తేలుస్తారన్నారు. మేం (న్యాయస్థానాలు)కాదని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

### చరిత్రలో నేటినిజం



కం॥ రాశిగ నిలచిన భాషా
పోశమ్మును తెలుసు వారి విజ్ఞానమ్మున్
ఆశావాదిని వేదిని
ఈశాముని "నార్ల వేంకటేశు"ని దలతున్ !!

(డిసెంబర్ 1 నార్ల వెంకటేశ్వరరావు జయంతి)



-రాధశ్రీ
సెల్: 9494481210

## బ్రిడ్జిపై నుంచి నదిలో పడ్డ వాహనం

### ఏడుగురు దుర్మరణం

ముంబయి,నవంబర్30(ఆర్ఎన్ఎ): అదుపుతప్పిన ఓ వాహనంబ్రిడ్జిపై నుంచి నదిలో పడిపోయింది. దీంతో ఏడుగురు దుర్మరణం చెందారు. మహారాష్ట్రలోని ధూలే తహసిల్ పరిధిలో శనివారం తెల్లవారుజామున ఈ ఘోర రోడ్డుప్రమాదం సంభవించింది. ప్రయాణికులతో వెళ్తున్న ఓ వాహనం అదుపుతప్పి బ్రిడ్జిపై నుంచి నదిలోకి పడిపోయింది. ఈ ప్రమాదంలో ఏడుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. వించూరు గ్రామానికి సమీపంలోని ధూలే - సోలాపూర్ హైవేపై ఈ ప్రమాదం జరిగింది. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను స్వాధీనం చేసుకుని.. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీప ఆస్పత్రికి తరలించారు. అతివేగం వల్లే ప్రమాదం జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు.

## జార్ఖండ్‌లో తొలిదశ పోలింగ్

### బ్రిడ్జ్ పేల్చి వేసిన మావోలు

రాంచీ,నవంబర్30(ఆర్ఎన్ఎ): జార్ఖండ్‌లో తొలిదశ ఎన్నికలు జరుగుతున్న వేళ మావోయిస్టులు రెచ్చిపోయారు. ఓ బ్రిడ్జ్‌ను పేల్చేశారు. గుమ్లా జిల్లాలోని బిష్ణుపూర్‌లో ఉన్న బ్రిడ్జ్‌ను పేల్చినట్లు డిప్యూటీ కమిషన్ రంజన్ తెలిపారు. రాష్ట్రంలో తొలి దశ పోలింగ్ జరుగుతున్నది. మొత్తం 13 నియోజకవర్గాల్లో ఓటింగ్ కొనసాగుతున్నది. అయితే ఓటింగ్‌కు ఎటువంటి ఆటంకం కలగలేదని పోలీసులు చెప్పారు. బ్రిడ్జ్ పేల్చివేత ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు. మొత్తం 5 దశల్లో జార్ఖండ్ ఎన్నికలు జరగనున్నాయి. అయితే తొలి దశలో 189 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. బ్రిడ్జి పేల్చివేతతో పోలీసులు కూంబింగ్ చేపట్టారు.

## రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఢీకొన్న కారు

హైదరాబాద్,నవంబర్30(ఆర్ఎన్ఎ): రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ ఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. నైపర్ కార్యాలయం ముందు రోడ్డు దాటుతుండగా కారు ఢీకొట్టడంతో... గుర్తు తెలియని వ్యక్తి అక్కడికి అక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతి చెందిన వ్యక్తి వివరాలు తెలుసుకునేందుకు పోలీసులు యత్నిస్తున్నారు.

## బంజారాభవన్, గిరిజన స్కూల్ నిర్మాణానికి నిధులు మంజూరు

హైదరాబాద్, నవంబర్ 30: సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో గిరిజన స్కూల్ ఏర్పాటు, బంజారా భవన్ నిర్మాణానికి ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. గిరిజన బాలుర రెసిడెన్షియల్ పాఠశాల కోసం రూ.28.57 కోట్లు, అదేవిధంగా బంజారా భవన్ నిర్మాణానికి రూ.1.50 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు వెలువరించింది. హుజూర్ నగర్ ఉపఎన్నికలో టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రజా కృతజ్ఞత సభలో సీఎం కేసీఆర్ పాల్గొని హుజూర్ నగర్ అభివృద్ధికి వరాల వాన కురిపించారు. ఈ క్రమంలో భాగంగానే ప్రభుత్వం నేడు గిరిజన పాఠశాల, బంజారా భవన్ నిర్మాణానికి నిధులను మంజూరు చేసింది.

## ఘోరాలు జరుగుతుంటే కేసీఆర్ ఎక్కడున్నాడు? - డీకే అరుణ




హైదారబాద్,నవంబర్30(ఆర్ఎన్ఎ):వైద్యురాలి హత్యను నిరసిస్తూ ఇందిరాపార్క్ దగ్గర బీజేపీ ధర్నా కార్యక్రమం చేపట్టనుందని ఆ పార్టీ నేత డీకే అరుణ తెలిపారు. ఉపఎన్నికల్లో గెలవగానే కేసీఆర్ ప్రెస్‌మీట్ పెడతాడని అలాంటిది.. రాష్ట్రంలో ఇన్ని ఘోరాలు జరుగుతుంటే కేసీఆర్ ఎక్కడున్నాడని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఏం జరిగినా చెప్పుకోవడానికి దిక్కు లేదని డీకే అరుణ పేర్కొన్నారు. ఆర్టీసీ సమ్మెను అణచివేయడానికి వేలాది మంది పోలీసులను వాడారని.. విపక్షాలను భయపెట్టడానికి ఇంటెలిజెన్స్‌ను వాడుకుంటున్నారని డీకే అరుణ విమర్శించారు. ఇప్పటికైన కేసీఆర్ స్పందించి వరుసగా రాష్ట్రంలో జరుగుతున్న హత్యాచారాల నివారణపై చర్యలు తీసుకోవాలన్నారు.

### దారుణం -కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

ఆడవాళ్ల వైపుచూస్తే గుడ్లు పీకేస్తామన్న సీఎం కేసీఆర్.. వైద్యురాలి ఘటనపై స్పందించకపోవడం దారుణమని కాంగ్రెస్ నేత జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. వైద్యురాలి తల్లిదండ్రుల ఫిర్యాదుపై పోలీసులు నిర్లక్ష్యం వహించారన్నారు. 100కు ఎందుకు ఫోన్ చేయలేదని హోంమంత్రి అనడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. పోలీసుల నిర్లక్ష్యం లేదని సీపీ చెప్పడం ఆశ్చర్యమని జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. వైద్యురాలి ఘటనకు ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. మద్యాన్ని ఆదాయవనరుగా చూస్తున్నారని.. అనర్థాలను గుర్తించడం లేదన్నారు. నిందితులను ఉరితీయడమే కరెక్ట్ అని ప్రజలు భావిస్తున్నారన్నారని జీవన్‌రెడ్డి పేర్కొన్నారు.

### చాలా బాధగా ఉంది - సినీనటుడు అలీ

వైద్యురాలి తల్లిదండ్రులను చూస్తుంటే గుండె కరిగిపోతోందని సినీనటుడు అలీ అన్నారు. వైద్యురాలి కుటుంబ సభ్యులను అలీ పరామర్శించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైద్యురాలికి జరిగిందే నిందితులకూ జరగాలని తల్లిదండ్రులు కోరుకుంటున్నారని చెప్పారు. వైద్యురాలు తన కూతురు లాంటిదన్నారు. కనీసం తల్లిదండ్రులకు మృతదేహంకూడా లేకుండా చేయడం దారుణమన్నారు. శవమైనా దొరికుంటే ఇంత బాధపడేవారు కాదేమో? అని అభిప్రాయపడ్డారు. వైద్యురాలి తల్లిదండ్రులు ఏడుస్తుంటే.. చాలా బాధగా ఉందన్నారు. న్యాయవాదులెవరూ కూడా ఈ కేసు తీసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. ఈ కేసు వాదించకూడదని బార్ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయం అభినందనీయమని పేర్కొన్నారు. వైద్యురాలి కుటుంబానికి న్యాయం జరగాలని డిమాండ్ చేశారు.

### ఆడపిల్ల ఉన్న ప్రతి తండ్రి భయపడాల్సిన పరిస్థితి

ఓయూకి రెగ్యులర్ వీసీ లేకపోవడం దారుణమని కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యలపై డిసెంబర్ 4న తలపెట్టిన దీక్షకు మద్దతు తెలపనున్నామని స్పష్టం చేశారు. ఆడపిల్ల ఉన్న ప్రతి తండ్రి భయపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని జగ్గారెడ్డి పేర్కొన్నారు. తాను కూడా భయపడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. వైద్యురాలి ఇంటికి వెళ్లి హోంమంత్రి చేసిన వ్యాఖ్యలు సరికాదన్నారు. వైద్యురాలి కుటుంబాన్ని సీఎం పరామర్శించాలని జగ్గారెడ్డి డిమాండ్ చేశారు.

### వైద్యురాలి హంతకులను ఉరితీయాలి - బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్

వైద్యురాలి హత్య కేసును ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరిపి నిందితులకు ఉరిశిక్ష వేయాలని బీజేపీ నేత లక్ష్మణ్ డిమాండ్ చేశారు. వైద్యురాలి కుటుంబసభ్యులను లక్ష్మణ్ పరామర్శించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. సభ్యసమాజం తలదించుకునే ఘటన జరగడం సిగ్గుచేటు అన్నారు. అమ్మాయిల కిడ్నాప్ కేసులు రోజురోజుకు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యురాలి కుటుంబసభ్యులను పోలీసులు హేళన చేస్తూ మాట్లాడటం విచారకరమన్నారు. సకాలంలో స్పందిస్తే ఇంత దారుణ ఘటన జరిగి ఉండేది కాదని అభిప్రాయపడ్డారు. మంత్రుల వ్యాఖ్యల తీరు చూస్తే అసహ్యంగా ఉందని వ్యాఖ్యానించారు. వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే మంత్రుల వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. మద్యాన్ని ప్రభుత్వం ఆదాయ వనరుగా చూడడం బాధాకరమని తెలిపారు. పబ్, డ్రగ్ కల్చర్ హైదరాబాద్‌ను పట్టి పీడిస్తోందని చెప్పారు. న్యాయవాదులెవరూ నిందితుల తరపున వాదించవద్దని విజ్ఞప్తి చేశారు. నిర్భయ లాంటి చట్టాలు వచ్చినా కట్టడి చేయలేకపోతున్నామని వాపోయారు. వైద్యురాలి ఘటన దేశాన్ని కలవరపరిచిందని పేర్కొన్నారు.

### ప్రభుత్వ పెద్దలు సిగ్గుతో తలవంచుకోవాలి

వైద్యురాలి కుటుంబసభ్యులను మాజీ మంత్రి గీతారెడ్డి శనివారం పరామర్శించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు.. మహిళల భద్రతను తెలంగాణ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. హైవేపై పెట్రోలింగ్ ఏమైందని గీతారెడ్డి ప్రశ్నించారు. డబ్బు వసూళ్లలో పోలీసులు బిజీగా ఉన్నారా? అని నిలదీశారు. మహిళలకు రక్షణ కల్పించలేని ప్రభుత్వ పెద్దలు సిగ్గుతో తలవంచుకోవాలన్నారు. ఎవరితోనైనా లేచిపోయిందా అని తల్లిదండ్రులను కించపరుస్తారా అంటూ పోలీసులపై గీతారెడ్డి తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్రెండ్లీ పోలీసా.. ఇన్సల్టింగ్ పోలీసా? అంటూ మండిపడ్డారు. బాధితురాలి కోసం వెదకకుండా టోల్‌ప్లాజాలో సీసీ టీవీలు చూస్తూ హాయిగా కూర్చున్నారని విమర్శించారు. పోలీసులు సకాలంలో స్పందించి ఉంటే అమ్మాయి బతికుండేదన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని గీతారెడ్డి డిమాండ్ చేశారు.

### వైద్యురాలి హత్యాచారం ఘటన బాధాకరం - సీపీఐ రాష్ట్ర అధ్యక్షుడు చాడ

వైద్యురాలి హత్యాచార ఘటన బాధాకరమని చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థ విఫలమైందన్నారు. మానవ మృగాలు ఆడపిల్లలను వేటాడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిందితులకు కఠినశిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు రాబోయే కాలంలో పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. రాష్ట్రంలో వరుస ఘటనలపై సీఎం కేసీఆర్ స్పందించాలని అన్నారు.

## అంతర్వేది లక్ష్మినరసింహస్వామిని దర్శించుకున్న మంత్రి జగదీష్‌రెడ్డి దంపతులు



అంతర్వేది లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న మంత్రి జగదీశ్వర్ రెడ్డి దంపతులు

హైదరాబాద్, నవంబర్ 30: ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది లక్ష్మీనరసింహస్వామిని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి దంపతులు నేడు దర్శించుకున్నారు.

ఆలయ కమిటీ సభ్యులు దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మంత్రి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి కుటుంబ సభ్యులకు వేదపండితులు ఆశీర్వచనం చేసి ప్రసాదాలు అందజేశారు.

# పెరుగుతున్న వలసలు..?

నేటి నిజం
ఆదివారం 1-12-2019

గడచిన పదేళ్ళకాలంలో మొట్టమొదటి సారిగా గ్రామీణ జనాభాకన్నా పట్టణ ప్రాంత జనాభా పెరిగిందని 2011 జనాభా లెక్కలు వెల్లడించాయి. వలసలు, సహజ పెరుగుదల కొత్త ప్రాంతాలను పట్టణాల్లో కలుపుకోవడం అందుకు కారణాలు కావచ్చునని సెన్సస్ నివేదికలో పేర్కొన్నారు. స్వాతంత్ర్యానంతరం దేశ జనాభాలో పెరుగుదల అతి తక్కువగా నమోదైన దశకంలోనే పల్లణ ప్రాంతాల్లో జనాభా భారీగా పెరగడం గమనార్హం. దేశ వ్యాప్తంగా జననాల రేటు పడిపోవడం వలన పట్టణాల్లో కలిపిన కొత్త ప్రాంతాల సంఖ్య అంతకు ముందటి పదేళ్ళకంటే వ్యవసాయ వృత్తులు పడకేయడమే కాదు కనీస సౌకర్యాలు కరువైన దుస్థితిలో కూలి చేసుకుని పొట్టపోషించుకునేందుకని పల్లె ప్రజలు భారీ సంఖ్యలో నగరవాసాలకు వలసపోతుండటమే ఈ పరిణామానికి అసలైన విషయం అనేది తేటతెల్లం అవుతోంది. *1991-2001* మధ్యకాలంలో దేశంలో *70* లక్షల మంది రైతులు వ్యవసాయాన్ని వదిలివేసినట్లు అంచనా. అంటే రోజుకు రెండువేల మందికి పైగా రైతులు కాడిపడేసారనేది నిజం. తరవాతి పదేళ్ళలో పల్లెల్లో జనాభా తగ్గి ఆ మేరకు పట్టణ ప్రాంతాల్లో భారీ పెరుగుదల నమోదు కావడాన్ని ఈ కోణంలోంచే చూడాలి. దేశ జనాభాలో మూడోవంతు అంతర్గతంగా వలసపోయినవారే!. అందులో *30* శాతం *15* నుండి *29* ఏళ్ళలోపు యువకులే కావడం గమనించాలి. వలసల్లో అత్యధికం పల్లెసీమల నుంచి పట్టణాలకు జరిగినవే! అనుమతి లేని పనులు, లెక్కలు పత్రాలు లేకపోవడం వంటి పనికిరాని పనుల వల్ల ఈ పథకం గ్రామీణులకు ఆశించినంతగా ఉపయోగపడలేకపోతోంది.

ధరోల్బణం బాగా పెరిగి ఆదాయాలు ఆదాయ మార్గాలు కుంచించుకుపోయిన దుస్థితిలో గ్రామాలకు గ్రామాలు కన్నీళ్ళు పెట్టుకుంటూ పట్టణప్రాంతాలకు బండ్లు కడుతున్నాయి. నిజంగా దుర్భర పరిస్థితి! ముఖ్యంగా గ్రామీణ జీవనం నరకప్రాయంగా మారడం ఒక ఎత్తైతే, ప్రతి ఒక్కరికీ అత్యవసరమైన మౌలిక సదుపాయాలు పల్లెటూళ్ళలోని కనీసం అయిదో వంతు కుటుంబాలకైనా ఇది అందుబాటులో లేవు. దాంతో రైతుల ఆత్మహత్యల సంఖ్య *1995* లో *10.700* అయితే *2009* నాటికి ఏకంగా *17.000* లకు చేరింది. *2012* తర్వాత రేషియో తగ్గినా రైతులు ఒక్క వ్యవసాయానికే కట్టుపడి ఉన్నారనడంలో మార్పు వచ్చింది. మరీ ముఖ్యంగా పోషకాహారలోపం సరైన వైద్య, ఆరోగ్య సేవలు అందుబాటులో లేకపోవడం గ్రామీణ భారతాన్ని మరింతగా కృంగదీస్తున్నాయి. తిష్టవేసిన పేదరికం అందుకు ప్రధాన కారణమయితే అదుపు తప్పిన ద్రవ్యోల్బణం దేశంలోని అనేక ప్రాంతాలలో మధ్యతరగతి ప్రజానీకాన్ని సైతం దారిద్ర్యరేఖ దిగువకు దిగలాగుతోందనడంలో వాస్తవం ఉంది. చెత్తను ఎప్పటికపుడు వదిలించుకోవడం, నిరంతరం విద్యుత్ సరఫరా, వీధిదీపాలు సక్రమంగా వెలిగేలా చేయాలి. విద్య, వైద్య, ఆరోగ్య రంగాలను పటిష్టం చేయాలి. రవాణా సౌకర్యాలను విస్తృత పరచాలి. గ్రామీణ పర్యాటకాన్ని ప్రోత్సహించాలి. బహుముఖ నైపుణ్యాలకు సానపెట్టాలి. కలలు, కథల మధ్య బతికే ఈ జీవితాల్లో వెలుగు ఎప్పుడో..!!

## మహిళలకు రక్షణలేకుండా పోతోంది

### వరుస ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి: సీతక్క

వరంగల్,నవంబర్30(ఆర్ఎన్ఎ): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజల సంక్షేమం పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి లేదని ములుగు కాంగ్రెస్ ఎమ్మెల్యే సీతక్క ధ్వజమెత్తారు. ప్రధానంగా మహిళలకు రక్షణ లేకుండ పోయిందన్నారు. వరుస ఘటనలు ప్రభుత్వ అసమర్థతను చూపుతున్నాయని అన్నారు. వరంగల్లో మానస, ప్రియాంకరెడ్డిల హత్యలపై ఆందోళన వ్యక్తం చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలుగుతోందని, మహిళలకు రక్షణ లేకుండా పోతోందని అన్నారు. ఇకపోతే ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యిందని మండిపడ్డారు. గతంలో తాను ఎమ్మెల్యేగా నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు. గతేడాది పత్తికి డిమాండ్ లేదని చెప్పడంతో సోయా వేశారని, ఈ యేడు పత్తివేసినా రైతులకు ఊరట దక్కలేదన్నారు. పత్తివేయకుండా.. సోయా పంట వేయాలని ప్రభుత్వం ఆనాడు చెప్పిందని.. కానీ ఈ ఏడాది పత్తికి మాత్రం అధికంగా ధర ఉంటుదనుకున్నా లాభం లేకుండా పోయిందన్నారు. అలాగే సోయాకు కూడా గిట్టుబాటు ధర లేదని వివరించారు. టీఆర్ఎస్ పార్టీ అధికారం చేపట్టాక రాష్ట్రంలో వ్యవసాయరంగం సంక్షోభంలో కూరుకు పోయిందని ఆమె విమర్శించారు. పత్తి సాగులో దక్షిణాదిలో తెలంగాణ నెంబర్ వన్‌గా ఉండేదని, ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో రైతులకు గిట్టుబాటు ధర అందక పత్తి స్థానం దిగజారిపోయిందన్నారు. ఆహార ధాన్యాల ఉత్పత్తుల్లోనూ రాష్ట్రం దిగజారిందన్నారు. దీంతో రైతుల ఆదాయం సగానికి పడిపోయిందన్నారు. గిరిజనులకు 12శాతం రిజర్వేషన్ అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని చెప్పారు.

## రానున్న రోజుల్లో సింగరేణికి మహర్దశ

### సింగరేణిపై అనవసర విమర్శలు తగవు
### అంతర్జాతీయ స్థాయికి తీసుకుని వెళ్లేలా ప్రణాళిక
### ఢిల్లీలో అధికార ప్రతినిధి వేణుగోపాలచారి

ఆదిలాబాద్,నవంబర్30(ఆర్ఎన్ఎ): రానున్న రోజుల్లో సింగరేణి సంస్థ ప్రపంచంలోనే అత్యుత్తమ సంస్థగా రూపుదిద్దుకోబోతోందని కేంద్రమాజీ మంత్రి, ఢిల్లీలో అధికార ప్రతినిధి వేణుగోపాలచారి స్పష్టం చేశారు. ఇప్పటికే సంస్థను లాభాల బాటలోకి తీసుకుని వచ్చిన సిఎం కెసిఆర్ దానిని అంతర్జాతీయ సంస్థగా తీర్చిదిదే ప్రణాళికలో ఉన్నారని అన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరవాతనే సింగరేణిని సిఎం కెసిఆర్ ప్రత్యేకంగా దృష్టి పెట్టి ముందుకు సాగారని అన్నారు. ఇది కార్మికులకు బాగా తెలుసన్నారు. సింగరేణికి బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ఇచ్చే అంశం ప్రతిపాదనలో ఉందని తెలిపారు. సింగరేణి అభివృద్ధి కోసం నిరంతరం తపించే కేసీఆర్,... దానిని కూడా అమ్మేస్తారని ఇటీవల విపక్ష పార్టీలు చేసిన విమర్శల్లో అర్థం లేదన్నారు. ఆర్టీసీ సమ్మె సందర్భంగా ఎవరు ఎన్ని విధాలుగా విమర్శలుచేసినా మళ్లీ కార్మికులకు అండగా నిలిచింది మాత్రం కెసిఆర్ అని అన్నారు. సింగరేణిలో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్లను నెరవేర్చిన ఘనత కేసీఆర్‌దేనని అన్నారు. గతంలో సీమాంధ్ర ప్రభుత్వాల హయాంలో సింగరేణి సంస్థ నిర్వీర్యమైందని గుర్తు చేశారు. ప్రత్యేక రాష్ట్రంలో సింగరేణి సంస్థ అభివృద్ధిపథంలో ముందుకు సాగుతుందని వివరించారు. కార్మికులకు కారుణ్య నియామకాలు అమలు చేయించిన ఘనుడు కేసీఆర్ అని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులకు ఇన్‌కంటాక్స్‌ను రద్దు చేయాలని పేర్కొంటూ అసెంబ్లీలో తీర్మాణం చేయించింది కేసీఆర్ అని గుర్తు చేశారు. ఆ తీర్మాణాన్ని కేంద్రం పక్కన బెట్టిందని వివరించారు. టీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతులకు 24 గంటల ఉచిత కరెంట్, వ్యవసాయానికి పంట పెట్టుబడి కింద రూ.10 వేలు, రైతులు ప్రమాదవశాత్తు, సహజ మరణం చెందితే జీవిత బీమా ద్వారా రూ.5 లక్షలు అందిస్తున్నామని తెలిపారు. దేశంలో ఎక్కడా ఈ పథకాలు లేవన్నారు. ఈ పథకాలను చూసి ప్రపంచ దేశాలు గర్విస్తున్నాయన్నారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ పరిశుద్ధమైన నీరు, మిషన్ కాకతీయతో చెరువుల అభివృద్ధి, ఆసరా పింఛన్ల ద్వారా వృద్ధులు, వితంతువులకు రూ.1000, వికలాంగులకు రూ.1500, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ ద్వారా పెళ్లి చేస్తున్న పేదింటి మహిళలకు సీఎం కేసీఆర్ గాడ్‌ఫాదర్‌లాగా రూ.1,00,116 అందిస్తున్నారని, ప్రభుత్వ దవాఖానల్లో మహిళలు ప్రసవం చేస్తే ఆడబిడ్డకు రూ.13 వేలు కేసీఆర్ కిట్, మగబిడ్డ పుడితే రూ.12 వేలు కేసీఆర్ కిట్‌ను అందిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో మరెన్నో పథకాలు ప్రవేశపెట్టారన్నారు.

## పాక్ ప్రచ్ఛన్న యుద్ధానికి తెరలేపుతోంది

### - కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

పూణెళి, నవంబర్30(ఆర్ఎన్ఎ) : నేరుగా తలపడే స్థితిలేక పాక్ పచ్ఛన్న యుద్ధానికి తెరలేపుతోందని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాక్ తీరుపై ధ్వజమెత్తారు. పూణెళిలో శనివారం జరిగిన 137 బ్యాచ్ అవుట్ పాసింగ్ పరేడ్‌లో రాజ్‌నాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంప్రదాయ యుద్ధంలో గెలవలేకే, పాక్ ప్రచ్ఛన్న యుద్ధానికి తెరలేపుతోందని తీవ్రంగా ఆరోపించారు. ప్రచ్ఛన్న యుద్ధం చివరికి పాక్ ఓటమికే దారి తీస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. 1965, 1971 మరియు 1999 లో జరిగిన సంప్రదాయిక, లేదా పరిమిత యుద్ధాల్లో పాక్ ఓడిపోయిందని, భారత్‌పై గెలవలేమని పాక్‌కు అప్పుడే కనువిప్పు కలిగిందని అన్నారు. తీవ్రవాద మాధ్యమం ద్వారా పాక్ ప్రచ్ఛన్న యుద్ధానికి పాల్పడాలన్న మార్గాన్ని ఎంచుకుందని, దీని ద్వారా ఓటమి తప్ప పాక్‌కు ఏమీ రాదని ఘంటాపథంగా చెబుతున్నానని ఆయన అన్నారు. ఇరుగు పొరుగు దేశాలతో భారత్ ఎప్పుడూ సత్సంబంధాలనే కోరుకుంటుందని ఆయన ప్రకటించారు. ఇతర దేశాలపై దాడులు దిగడం కానీ, ఆక్రమించడానికి కానీ ప్రయత్నం చేయదని, కానీ ఎవరైనా రెచ్చగొడితే మాత్రం తగిన మూల్యం చెల్లించాల్సి వుంటుందని హెచ్చరించారు. భారతదేశ ప్రజల సార్వభౌమత్వానికి, భద్రతకు తాము కట్టుబడి ఉన్నామని, కానీ ఎవరైనా దేశంలో ఉగ్రవాద శిబిరాలు నడుపుతుంటే లేదా, దాడికి పాల్పడితే మాత్రం సమాధానం ఎలా ఇవ్వాలో ప్రభుత్వానికి తెలుసునని రాజ్‌నాథ్ ఘాటుగా వ్యాఖ్యానించారు.

## ఫిబ్రవరి నాటికి ఆస్పత్రి నిర్మాణాన్ని పూర్తిచేస్తాం

### - మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

హైదరాబాద్,నవంబర్30(ఆర్ఎన్ఎ): అమీర్‌పేట పరిసర ప్రాంతాల వాసులకు అందుబాటులో ఉండే విధంగా 50పడకల ఆసుపత్రి నిర్మాణం త్వరలో పూర్తికానుందని పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శుక్రవారం ఆసుపత్రి భవన నిర్మాణ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ.. ఆసుపత్రి నిర్మాణ పనులను ఫిబ్రవరి నాటికి పూర్తిచేసేలా పనులను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. గతంలో 30పడకల ఆసుపత్రిగా నిర్మాణం చేపట్టి అసంపూర్తిగా వదిలేయడంతో తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత 3.28 కోట్ల వ్యయంతో 50 పడకల ఆసుపత్రిగా నిర్మాణం చేపట్టినట్టు తెలిపారు. ఈ ఆసుపత్రి పూర్తయితే ఎర్రగడ్డ, మోతినగర్, బోరబండ, ఫతేనగర్, బాలానగర్, బేగంపేట తదితర ప్రాంతాల ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని ఆయన వివరించారు. ప్రస్తుతం ఆయా ప్రాంతాల వాసులు దూర ప్రాంతంలో ఉన్న గాంధీ, కోఠి ఆసుపత్రులకు వైద్యసేవల కోసం వెళ్లాల్సివస్తోందని అన్నారు. 50పడకల ఆసుపత్రి భవన నిర్మాణం పూర్తయిన తర్వాత ఆధునాతన ల్యాబ్‌సౌకర్యం, పరికరాలు సమకూర్చుకోవడం, పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించుకోవడం జరుగుతుందన్నారు.

# ఈ ప్రశ్నలకు బదులేదీ?

హైదరాబాద్, నవంబర్30:ఎన్నాళ్లు ఇలా అమ్మాయిలపై మృగాళ్ల ఘాతుకం..కఠిన చట్టాలు ఉన్నా ఎందుకు భయం కలగడం లేదు.. అలాగే ఢిల్లీ నిర్భయ తరహాలో ఘటనలు జరుగుతున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు. అలాగే ఒంటరిగా ఓ అమ్మాయి బయటకు వెళితే ఎందుకు రక్షణ కల్పించడం లేదు. అమ్మాయిలకు రక్షణ లేకపోవడం దారుణం కాక మరోటి కాదు. వరుస ఘటనలు చోటు చేసుకుంటున్నా పోలీసులు కఠినంగా ఎందుకు వ్యవహరించడం లేదు. సిసి కెమెరాలు పెట్టింది ..ఘాతకం జరిగిన తరవాత పరిశీలించడానికా లేక.. వాటిని మానిటరింగ్ చేయడం ద్వారా నేరాలను నిరోధించడానికి కాదా ? అన్న అనుమానాలు కలుగుతున్నాయి. ప్రియాంక, మానస, మరో గుర్తు తెలియని మహిళ దహనం రాష్ట్రాన్ని కలచివేస్తున్న తాజా సమస్యలు.. విచ్చలవిడిగా మద్యం అమ్మకాల కారణంగా నేరాలు పెరుగుతున్నాయి. పోలీసులకు అధునాత వాహనాలు, సెల్ ఫోన్లు ఇచ్చినా గస్తీ చేయడంలో నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. బయటకు వెళ్లిన మహిళల రక్షణ లేకుండా పోలేకపోవడం దారుణం కాక మరోటి కాదు. ఫిర్యాదు చేయడానికి వెళితే తమ పరిధి కాదని పోలీసులు ఎలా తిప్పి పంపుతారు. ఏ పోలీస్ స్టేషన్‌కు వెళ్లినా ముందు కేసు నమోదు చేసి అలర్ట్ చేసే వ్యవస్థను ఎందుకు అమలుచేయరు? ప్రియాంక తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడానికి వెళితే తమ పరిధి కాదని పోలీసులు తిప్పి పంపడం వల్ల జరగాల్సిన ఘోరం జరిగింది. ఇది పోలీసుల నిర్లక్ష్యం కాక మరోటి కాదు. ఇకపోతే కొందరు వ్యక్తులు అమ్మాయిలను వేధిస్తున్నారని తెలిసినా ఆ వైపు కన్నెత్తి చూడకపోవడం వల్ల ఇవాళ ప్రియాంక ఘటన జరిగింది. ఇప్పుడు ప్రియాంక హత్య కేసులో వేధిస్తున్న సమస్య ఇదే. కేసును 24 గంటల్లో ఛేదించామని సైబరాబాద్ పోలీసులు ఘనంగా చాటు కుంటున్నా..కేసు నమోదు విషయంలో వారు అనుసరించిన తీరు విమర్శలకు తావిస్తోంది. రాత్ర పదిన్నర గంటల సమయంలోనే తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడానికి వెళితే కేసునమోదు చేయకుండా తిప్పడం... ఎక్కడో లేచిపోయి ఉంటుందనే సూటిపోటి మాటలు చెప్పడం దారుణమైన విషయంగా పరిగణించాలి. ఈ విషయంలో ముందు పోలీసులను దోషులగా గుర్తించాలి. మద్యం మత్తులో కామాంధులుగా మారిన నలుగురి మధ్య ప్రియాంక నలిగిపోయింది. అఘాయిత్యానికి పాల్పడిన ఇద్దరు లారీడ్రైవర్లు, ఇద్దరు క్లీనర్లను సైబరాబాద్ పోలీసులు అరెస్ట్‌చేశారు. ప్రియాంక స్కూటీని పార్క్‌చేయడం అక్కడే ఉన్న నారాయణపేట జిల్లా, మక్తల్ మండలం జక్లూరుకు చెందిన మహ్మద్ పాషా అలియాస్ అరీఫ్, అదే మండలం గుడిగంట్లకు చెందిన లారీక్లీనర్లు జొల్లు శివ, జొల్లు నవీన్, మరో డ్రైవర్ చింతకుంట చెన్నకేశవులు గమనించారు. మహ్మద్ తాను లారీలో తెచ్చిన ఇటుకను అన్‌లోడ్ చేయాల్సి ఉండగా, దానిని తీసుకోవాల్సిన యజమాని ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో లారీని శంషాబాద్ టోల్‌గేట్ వద్ద నిలిపాడు. సాయంత్రం తన సహచరులతో కలిసి మద్యం సేవిస్తున్నాడు. అదే సమయంలో ప్రియాంక అక్కడ స్కూటీని పార్కుచేస్తున్న విషయాన్ని గమనించారు. ఆమె వెళ్లాక నవీన్ వెళ్లి స్కూటీ టైర్‌లో గాలి తీసేశాడు. ఇదంతా సిసి కెమెరాల్లో రికార్డు అయ్యింది. నిజంగా పోలీసులు సిసి కెమెరాలను మానిటర్ చేసినా ఇలాంటి నేరాలు ఆపగలిగే వారు. కానీ అలాంటి ప్రయత్నాలు జరగలేదు. గచ్చిబౌలిలో పని పూర్తిచేసుకొని ప్రియాంక రాత్రి 9.15 గంటల ప్రాంతంలో టోల్‌ప్లాజా వద్దకు వచ్చిన సమయంలో ఈ ఘటన జరిగింది. స్కూటీ వద్దకు వచ్చి గాలిలేక పోవడంతో వాహనాన్ని పరిశీలిస్తుండగా.. అరీఫ్ లారీలో నుంచి దిగి ఆమె వద్దకు వచ్చి, బండి పంక్చర్ చేయిస్తామని చెప్పి.. క్లీనర్ శివకు అప్పగించాడు. వీరి వాలకం చూసి భయమేసిన ప్రియాంక ఒంటరిగా ఉన్నానంటూ సోదరికి ఫోన్‌చేసి మాట్లాడింది. సోదరి ఆమెను టోల్‌ప్లాజా వద్దకు వెళ్లాలంటూ సూచించింది. కొద్దిసేపటికి అరీఫ్, నవీన్, చెన్నకేశవులు ఆమెను బలవంతంగా పక్కనేఉన్న ప్రహరీ లోపలకు తీసుకెళ్లడం అత్యాచారం చేయడం..హత్య చేయడం జరిగిపోయాయి. ఇదంతా టోల్‌ప్లాజాకు సమీపంలో జరిగిందే. పెట్రోలింగ్ పోలీస్ వాహనాలు రాత్రి అప్పుడప్పుడు ఇటుగా వచ్చినా దుండగులకు భయం ఉండేది. కానీ అలా జరగలేదు. ఈ వరుస ఘటనలు చూస్తుంటే కొన్ని లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఒకటి మద్యం కారణంగా నేరాలు పెరగడం కనిపిస్తోంది. అలాగే పోలీసుల పర్యవేక్షణ లేకపోవడం...అలాగే పోలీసులు ఏ క్షణాల్లో అయినా ఊడిపడతారన్న భయం లేకపోవడం...ఇక నేరం చేస్తే కఠిన శిక్షలు అనుభవించాల్సి వస్తుందన్న భయం లేకపోవడం.. ఈ ఘటనల ఆధారంగా ఇప్పుడు ఈ సమస్యలపై పోలీసులు దృష్టి సారించాలి. అమ్మాయిలు కనిపించడం లేదన్న ఫిర్యాదు రాగానే లవ్ కేసులుగా కొట్టిపారేయడంతగని పని. ముందు వెంటనే రంగంలోకి దిగి చర్యలు తీసుకోవాలి. కఠినంగా ఉంటూ నేరాలను అదుపుచేసే ప్రక్రియలు చేపట్టాలి. లారీ డ్రైవర్లు క్లీనర్లు మద్యం సేవించి లారీలు ఎక్కకుండా చూడాలి. వారిని అవసరమైతే వెన్నాడాలి. అప్పుడే ప్రజల్లో భయం కలుగుతుంది. నేరాలు జరిగాక పరిశోధనలు, దర్యాప్తులు చేయడం కన్నా ..నేరాలు జరక్కుండా నిరోధించే చర్యలపై పోలీసులు అప్రమత్తం కావాలి. పోలీసులు ఉన్నారన్న భయం ప్రజల్లో కలిగేలా చేయాలి. అప్పుడే సమాజంలో కిరాతకఘటనలు తగ్గుముఖం పట్టగలవు.

# రాజకీయ సిద్ధాంతాలకు తిలోదకాలు

### ఫిరాయింపులతో మారుతున్న ప్రభుత్వాలు
### కఠిన చట్టాలతోనే చెక్ పెట్టడం సాధ్యం

న్యూఢిల్లీ,నవంబర్30(ఆర్ఎన్ఎ): భారత రాజకీయాల్లో విలువలకు ఎప్పుడో తిలోదకాలు ఇచ్చారు. ఫిరాయింపులు అపహాస్యం కావడం... ఒకపార్టీపై గెలిచిన వారు మరో పార్టీలో చేరడం..మంత్రి పదవులు పొందడం..స్పీకర్లు నిర్ణయాలు తీసుకోకపోవడం...కోర్టులు ప్రేక్షకపాత్ర వహించడం..రాజ్యాంగం అవహాస్యం కావడం అన్న పదాలు మన ప్రజాస్వామ్యంలో నిత్యకృత్యం అయ్యాయి. ఇందులో ఎవరు కూడా సచ్చీలురని చెప్పడానికి లేదు. అంతా ఒక తాను ముక్కలే. నీతులు వల్లిస్తున్న వారంతా ఒకప్పుడు ఇలాంటి తప్పిదాలను ప్రోత్సహించిన వారే. రాజకీయాల్లో ఒకపార్టీ నుంచి మరో పార్టీలోకి ఫిరాయించడం సర్వ సాధారణమైన విషయంగా మారింది. ఫిరాయింపులతో ప్రభుత్వాలను ప్రభావితం చేస్తున్నారు. మద్దతుఇవ్వడం వెనక్కి తీసుకోవడం వంటి చర్యలతో ప్రభుత్వాను శాసిస్తున్నారు. దీంతో రాజకీయ వాతావరణం కలుషితం అవుతోంది. ఈ కారణంగా మొన్నటికి మొన్న మహారాష్ట్రలో బిజెపి నేత ఫడ్నవీస్ అధికారం చేపట్టడం రాజీనామాచేయడం జరిగిపోయింది. దేశంలో పార్టీలు ఫిరాయించడమన్నది ఒకప్పుడు నేరంగా పరిగణించేవారు. అలాంటి వారిని చులకనగా చూసేవారు. కానీ ఇప్పుడు అధికారమే పరమావధిగా పార్టీలు మారడం గెలిచిన వారికి వెన్నతోపెట్టిన విద్యగా మారింది. ఎన్నికల కోలాహలంలో ఇది మరీ ఎక్కువగా కనిపిస్తుంది. ఆయా పార్టీల్లో టిక్కెట్లు దక్కని వారంతా సిద్ధాంతాల పేరుతో ఫిరాయిస్తు న్నారు. రాజకీయా పార్టీల్లో విలువుల లేకపోవడం, రాజకీయ నేతలకు నిబద్ధత లేకపోవడం ఇందుకు నిదర్శనం. పదవులే ప్రాతిపదికగా ఫిరాయింపులు జరుగుతుం టాయి. వీరంతా ఆయా పార్టీల సిద్ధాంతా లకు కట్టుబడి ఉంటారన్న నమ్మకం లేదు. ఎప్పుడు ఏది అవసరమో అదే సిద్ధాంతం. ఇకపోతే రాజకీయాల్లో అవసరాలే ముఖ్యం. అందుకే గతంలో ఏం మాట్లాడారన్నది ఇప్పుడు ముఖ్యం కాదు. అధికార పార్టీలోకి మారడం ..ఇప్పటి వరకు ఉన్న పార్టీని నిందించడం షరా మామూలు అయ్యింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెండు తెలుగు రాష్ట్రాలుగా ఏర్పడ్డ తరవాత ఫిరాయింపులు ఓ మోతాదును మించాయనే చెప్పాలి. అయినంత మాత్రాన అదేదో గతంలో జరగలేదన డానికి వీలులేదు. గతంలో వైఎస్ అధికారంలో ఉండగా టిఆర్ఎస్, టిడిపి సభ్యులను గంపగుత్తగా చేర్చుకుని ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారు. అధికారంలో ఉన్న పార్టీలోకి వెళ్లడం అన్నది సహజమైన ప్రక్రియ. దీనికి రాజ్యాంగ పరంగా గట్టి చర్యలు తీసుకునే వీలు లేకుండా పోయింది. చట్టం ఉన్నా దానిని చట్టుబండలు చేశారు. స్పీకర్లు ఆనాడూ, ఈనాడు కూడా మౌనంగా ఉంటూ కాల యాపన చేస్తూనే వచ్చారు. తెలంగాణలో ఆనాడు స్పీకర్‌గా ఉన్న మధుసూదనాచారి,ఎపి అసెంబ్లీ స్పీకర్ కోడెల శివప్రసాదరావులు కూడా చట్టానికి అతీతంగానే వ్యవహరించి ఫిరాయింపులపై ఎలాంటి చర్యా తీసుకోకుండా చరిత్రకెక్కారు. ఆంధ్రప్రదేశ్‌లో పార్టీ ఫిరాయింపుదారులకు మంత్రి పదవులు కట్టబెట్టడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారనే చెప్పాలి. ఫిరాయించడమంటే ప్రజాస్వామ్య విలువలను, ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని మంటగలపడమే అవుతుందని రాజ్యసభ ఛైర్మన్, ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు గతంలో అనేకమార్లు ఆవేదన చెందారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని, తమ పార్టీకి చెడ్డపేరు రాకూడదనే సదుద్దేశం ఏ పార్టీకి కూడా లేదు. అయినంత మాత్రాన రాజ్యాంగ ఉల్లంఘన కాబోదన్న కొత్త రాజ్యాంగాన్ని మన నాయకులు రూఢీ చేశారు. ఇలా పార్టీలు మారడం రాజ్యాంగం పదో షెడ్యూల్ లోని పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని ఉల్లంఘించడమే అవుతుంది. ఒక పార్టీ గుర్తుపై గెలిచిన వారు ఆ పదవికి రాజీనామా చేయకుండా మరో పార్టీలోకి వెళ్లడానికి వీల్లేదని పదో షెడ్యూల్‌లో ఫిరాయింపుల నిరోధక చట్టం చెబుతోంది. అయితే ఈ షెడ్యూల్ అప్పుడూ ఇప్పుడూ ఒకటే చెబుతోంది. రాజకీయ పార్టీలు ఇతర పార్టీల నేతలను తమ పార్టీలోకి ఆహ్వానించేందుకు రకరకాల ఆశలు చూపుతుంటాయి. ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి మంత్రి పదవులు ఇవ్వడం రాజ్యాంగ విరుద్ధమని చెప్పేవారు నడిరోడ్డుపై నిలబడి గతానికి సమాధానం చెప్పాలి. పార్టీ ఫిరాయింపుల చట్టానికి తూట్లు పొడుస్తూ ప్రధాని మొదలు సిఎంల వరకు రాజ్యాంగ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నారు. ఇలాంటి వారు రాజ్యాంగాన్ని గురించి మాట్లాడకుండా ముందుగా ఆత్మపరిశీలన చేసుకోవాలి. ఐదు రాష్ట్రాల ఎన్నికల తరవాత ఫిరాయింపులు ఉంటాయి. ఎవరు ఏ పార్టీ నుంచి గెలిచారన్నది ముఖ్యం కాదు. ఏ పార్టీలో చేరామన్నదే ముఖ్యం. ప్రధానంగా అధికారంలో ఉన్న పార్టీలోకి ఫిరాయించడం అన్నది ప్రధానం కాబోతున్నది. అధికార పార్టీ వారు కూడా తమ అధికారాన్ని పదిలం చేసుకునేందుకు ఫిరాయింపులను ప్రోత్సహించడం పరిపాటిగా మారింది. ఎపిలో రాజీనామాచేసి వస్తేనే పార్టీలో చేర్చుకుంటమాని వైకాపా అధినేత జగన్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతించాలి.

### మన జీవనవిధానంలో..

# నీటి సంరక్షణ, మొక్కల పెంపకం భాగంకావాలి

### - పర్యావరణ రక్షణలో కార్పొరేట్, ఐ.టీ. భాగస్వామ్యం కావాలి
### - పర్యావరణశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

హైదరాబాద్, నవంబర్30(ఆర్ఎన్ఎ) :ప్రతీ ఒక్కరి జీవన విధానంలో నీటి సంరక్షణ, మొక్కల పెంపకం భాగం కావాలని పర్యావరణ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ ఐ.టీ కారిడార్ లో ఉన్న కొత్తగూడ బొటానికల్ గార్డెన్‌లో శుక్రవారం ప్రముఖ ఐటీ కంపెనీ డెలాయిట్ నిర్వహించిన ఇంపాక్ట్ డే కార్యక్రమంలో అటవీ అభివృద్ధి కార్పోరేషన్ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి తో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతీఒక్కరి జీవన విధానంలో నీటి సంరక్షణ, మొక్కల పెంపకం భాగం కావాలన్నారు. హరిత తెలంగాణ సాధనలో ప్రభుత్వ ప్రయత్నాలకు కార్పోరేట్ సంస్థల సామాజిక బాధ్యత కూడా తోడైతే మంచి ఫలితాలు వస్తాయన్నారు. గతంలో పూర్తిగా క్షీణించిన బొటానికల్ గా÷-ర్డ÷న్, ప్రభుత్వ కృషితో ప్రస్తుతం వచ్చదనంతో కళకళలాడుతోందన్నారు. తెలంగాణ వ్యాప్తంగా అన్ని పట్టణ ప్రాంతాలకు సమీపంలో అర్బన్ లంగ్ స్పేస్ లను (స్వచ్ఛమైన ప్రాణవాయువును అందించే ప్రాంతాలను) అభివృద్ధి చేయాలన్న ధ్యేయంతో పనిచేస్తున్నామన్నారు. గాలి కాలుష్యం వల్ల ఢిల్లీలో బతికే పరిస్థితి లేదని, స్కూళ్లకు పది రోజుల పాటు సెలవులు కూడా ఇచ్చారని, ఆ దుస్థితి మనకు రావొద్దన్నారు. అనంతరం అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. నిత్యం బిజీగా ఉండే సాఫ్ట్ వేర్ ఉద్యోగులు వీలు ఉన్నప్పుడల్లా పర్యావరణహిత కార్యక్రమాల్లో పాల్గొనాలని అన్నారు. తాము నాటిన మొక్కలను కనీసం నెల రోజుల్లో ఒక్కసారైనా ఉద్యోగులు పర్యవేక్షించాలని, అవి చక్కగా ఎదిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. 273 ఎకరాల్లో విస్తరించి ఉన్న బొటానికల్ గార్డెన్ ఐటీ కారిడార్, గచ్చిబౌలి ప్రాంతాలకు తరగని ప్రకృతి వనరుగా తీర్చిదిద్దేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, స్థానికులతో పాటు కంపెనీలు, ఐటీ సంస్థలు ఇందులో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో అటవీ అభివృద్ధి సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పి. రఘువీర్, రవీందర్ రెడ్డి, ఎఫ్.డీ.సీ జనరల్ మేనేజర్, నాగభూషణం, ఓఎస్డీ, ఔషధ మొక్కల నిపుణులు డి. బసవ శంకర్, స్మరణ్ ఎన్జీవో ప్రతినిధి సుభాష్, కార్పోరేషన్ సిబ్బంది, వాకర్స్ అసోసియేష్ ప్రతినిధులు పాల్గొన్నారు. అటవీ అభివృద్ధి సంస్థ పిలుపు మేరకు సుమారు ఐదు వందల మంది డెలాయిట్ కంపెనీ సాఫ్ట్ వేర్ ఉద్యోగులు బొటానికల్ గార్డెన్‌లో క్లీనింగ్ అండ్ గ్రీనింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారన్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ధన్వంతరి మూలికావనంలో ఔషధ మొక్కలు నాటారు. వర్షపు నీరు ఇంకి, భూగర్భ జలాలు పెరిగేందుకు వీలుగా ఏర్పాటు చేస్తున్న ఇంకుడు గుంతలను తవ్వారు. దూలపల్లి ఫారెస్ట్ అకాడమీ నుంచి వచ్చిన సిబ్బంది వీరికి మొక్కలు నాటడంలో సాంకేతిక సహకారం అందించారు.

## అమ్మ ఒడికి చేరిన చిన్నారి

### - ఖమ్మం ప్రభుత్వాసుపత్రిలో కిడ్నాపైన చిన్నారి క్షేమం
### - విజయవాడలో గుర్తించి తల్లికి వద్దకు చేర్చిన పోలీసులు

ఖమ్మం, నవంబర్30(ఆర్ఎన్ఎ) : మిస్టరీ వీడింది. ఉత్కంఠకు తెరపడింది. ఖమ్మం ప్రభుత్వాసుపత్రిలో కిడ్నాప్ అయిన చిన్నారి ఆచూకీ లభ్యమైంది. పోలీసులు చిన్నారిని క్షేమంగా తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. ఖమ్మం ప్రభుత్వాస్పత్రిలో నవంబర్ 26న 16రోజుల నవజాత శిశువు అపహరణకు గురైన సంగతి తెలిసిందే. చిన్నారిని ఓ మహిళ ఎత్తుకెళ్లినట్లు సీసీ కెమెరాల్లో రికార్డ్ అయ్యింది. రంగంలోకి దిగిన పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేశారు. పలు ప్రాంతాల్లో బృందాలుగా విడిపోయి విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఇంతలో విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చిన్నారిని గుర్తించారు. అనూహ్య సంఘటనల మధ్య చిన్నారి ఆచూకీని పోలీసులు గుర్తించారు. విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి చికిత్స కోసం ఓ మహిళ చిన్నారిని తీసుకొచ్చింది. వైద్యులకు తల్లి తీరుపట్ల అనుమానం రావటంతో వెంటనే వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. రంగంలోకి దిగిన పోలీసులు ఆరాతీయగా.. అసలు విషయం బయటపడింది. చికిత్స నిమిత్తం తీసుకొచ్చిన చిన్నారి ఖమ్మంలోకి కిడ్నాప్ అయిన చిన్నారిగా పోలీసులు గుర్తించారు. కిడ్నాప్ ముఠాను పోలీసులు పట్టుకున్నారు. కిడ్నాప్ ముఠాకి సంబంధించి కృష్ణా జిల్లా మైలవరంలో నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. చిన్నారి ఆచూకీ లభించడం, క్షేమంగా తల్లిదండ్రుల చెంతకు చేరడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా తమ బిడ్డను క్షేమంగా తీసుకొచ్చిన పోలీసులకు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## బీజేపీలో చేరిన బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి

### - పార్టీ కండువాకప్పి ఆహ్వానించిన జేపీ నడ్డా

న్యూఢిల్లీ, నవంబర్30(ఆర్ఎన్ఎ) : మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి, బిగ్‌బాస్ తెలుగు సీజన్ - 2 విన్నర్ కౌశల్ భారతీయ జనతా పార్టీలో చేరారు. ఢిల్లీలో బీజేపీ జాతీయ పార్టీ కార్యాలయంలో శుక్రవారం బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేపీ నడ్డా సమక్షంలో వీరు బీజేపీ కండువా కప్పుకున్నారు. వీరితో పాటు బైరెడ్డి కుమార్తె ప్రముఖ రేడియాలజిస్ట్ డాక్టర్ శబరి, కౌశల్ సతీమణి నీలిమ బీజేపీలో చేరారు. టీడీపీ నుంచి తన రాజకీయ జీవితాన్ని మొదలుపెట్టిన బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి, తరువాతి కాలంలో టీడీపీకి రాజీనామా చేసి రాయలసీమ పరిరక్షణ సమితి పెట్టి ప్రజల్లోకి వెళ్లారు. 2014 ఎన్నికల సమయంలో నంద్యాల పార్లమెంటుకు పోటీ చెయ్యాలని భావించారు. కానీ కుదరలేదు. 2019 ఎన్నికలకు ముందు టీడీపీలో చేరేందుకు విశ్వప్రయత్నాలు చేశారు. కానీ టిక్కెట్ హామీ దొరకకపోవడంతో 2018 లో రాహుల్ గాంధీ సమక్షంలో కాంగ్రెస్ లో చేరారు. అక్కడా ఇమడలేక సరిగ్గా 2019 సాధారణ ఎన్నికలకు పదిరోజుల ముందే కాంగ్రెస్‌కు గుడ్ బై చెప్పేసి చివరకు టీడీపీలో చేరారు. ఇక బిగ్ బాస్ 2 టైటిల్ విన్ అయిన తర్వాత చంద్రబాబును కలిసి టీడీపీకి సపోర్ట్ చేసిన కౌశల్ రాజకీయాల్లో కాస్త ఇంట్రస్ట్ ఉన్నారు. అయితే పార్టీలో మాత్రం చేరలేదు.

ఇప్పుడు మాత్రం బీజేపీ కండువా కప్పుకుని ఆ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బైరెడ్డి మాట్లాడుతూ.. రాయలసీమ అభివృద్ధి చెందాలంటే బీజేపీతోనే సాధ్యమని నమ్ముతున్నట్లుగా చెప్పారు. దేశంలో పరిస్థితులు బాగుపడాలంటే ప్రధాని నరేంద్ర మోడీ నిస్వార్థ రాజకీయాలు అవసరం అని అభిప్రాయపడ్డారు. అందుకోసమే తాను బీజేపీలో చేరారని వెల్లడించారు. త్వరలోనే కర్నూలులో బహిరంగ సభ నిర్వహిస్తామని, ఆ సభకు రావాల్సిందిగా జేపీ నడ్డాను కోరినట్టు వెల్లడించారు.

## సిఎం కేసీఆర్ కార్మిక పక్షపాతి

### ఆర్టీసీకార్మికుల విషయంలో రుజువయ్యింది
### -కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి

హైదరాబాద్,నవంబర్30(ఆర్ఎన్ఎ): కార్మికులంటే ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఎంతో ప్రేమ ఉందని, ఆయన కార్మిక పక్షపాతి అని కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి అన్నారు. సీఎం ఎంతటి కార్మిక పక్షపాతో ఆర్టీసీ కార్మికులను ఎటువంటి షరతులు లేకుండా విధుల్లోకి తీసుకున్నారంటేనే అర్థం అవుతుందని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం నిరంతరం కార్మికుల బాగోగుల కోసమే ఆలోచిస్తుందని అన్నారు. శుక్రవారం తన ఛాంబర్‌లో ఇటీవల ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగిన వివిధ ప్రమాదాల్లోచనిపోయిన వారి కుటుంబాలకు నష్టపరిహార చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపడం కోసం వారి సంక్షేమం కోసం నిరంతరం ఆలోచిస్తున్న వ్యక్తి కేసీఆర్ అన్నారు. రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకూ 1,03,754 మంది కార్మికులకు 346.37 కోట్లకు పైగానే సాయం అందించారని అన్నారు. ఈ లక్షకు పైగా మరణించిన కార్మికుల కుటుంబాలకు పెద్ద మొత్తంలో సాయం అందించిన ఘనత తెలంగాణ ప్రభుత్వానిదేనని అన్నారు. భవన నిర్మాణ కార్మికులు తమ దగ్గరలో ఉన్న మీ సేవా కేంద్రం ద్వారా నెలకు ఒక రూపాయి లేదా సంవత్సరానికి 12 రూపాయలు లేదా 5 సంవత్సరాలకు 60 రూపాయలు చెల్లించి గుర్తింపు కార్డు పొందాలని మంత్రి సూచించారు.ప్రమాద వశాత్తు మరిణించిన కార్మికుల కుటుంబాలకు 6లక్షలు, దహన సంస్కారానికి 30వే లు సాయంగా ఇస్తున్నామని తెలిపారు.

## పంచాయితీలకు కొత్త భవనాల నిర్మాణం

### -అధికారులతో సమీక్షలో మంత్రి ఎర్రబెల్లి

హైదరాబాద్,నవంబర్30(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో నూతనంగా ఏర్పడ్డ గ్రామపంచాయతీలకు దశలవారీగా సొంత భవనాలు నిర్మిస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ పథకం కింద భవనాల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. భూమి లభ్యత ఉండి, సొంత భవనాలు లేని గ్రామాలకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. అదేవిధంగా ఎక్కువ మంది ప్రజలకు ఉపయోగపడే రోడ్ల నిర్మాణానికి మొదటి ప్రాధాన్యత ఇస్తామన్నారు. బస్సులు తిరిగే రహదార్ల మరమ్మతులకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో డంపింగ్‌యార్డు, శ్మశానవాటిక నిర్మాణం పూర్తిచేయాలని పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం మంత్రి ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు.

# మెజార్టీ ఉంటే ఎమ్మెల్యేల్ని ఎందుకు దాచినట్టో!

### - మహారాష్ట్ర మాజీ సీఎం ఫడణవీస్ ధ్వజం

ముంబయి, నవంబర్30(ఆర్ఎన్ఎ) : మహారాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరిన కొద్దిసేపటికే జరిగిన తొలి కేబినెట్ భేటీలో తీవ్ర కష్టాల్లో ఉన్న రైతులకు ఉపశమనం కల్గించే చర్యలపై కాకుండా అసెంబ్లీలో జరగబోయే బలనిరూపణలో ఎలా నెగ్గాలనే అంశంపై చర్చించడం హాస్యాస్పదమని మహారాష్ట్రలో మాజీ సీఎం దేవేంద్ర ఫడణవీస్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. శుక్రవారం ఆయన వరుస ట్వీట్లు చేశారు. తగిన సంఖ్యాబలం ఉందని గతం నుంచి కూటమి నేతలు చెబుతున్నారు కదా.. బల పరీక్షలో నెగ్గడంపై ఇంకా చర్చలెందుకని ఫడణవీస్ ప్రశ్నించారు. ఉద్ధవ్ నేతృత్వంలో ఏర్పాటైన మహారాష్ట్ర వికాస్ అఘాడి తమకు తగిన సంఖ్యాబలం ఉందని చెప్పిందనీ.. అదే నిజమైతే నిబంధనలకు విరుద్ధంగా ప్రొటెం స్పీకర్‌ను మార్చాలని కూటమిలోని మూడు పార్టీలు ఎందుకు ప్రయత్నిస్తున్నాయని నిలదీశారు. శివసేన తన ఎమ్మెల్యేలను హోటళ్లలో ఉంచడంపైనా విమర్శలు సంధించారు. మీ ఎమ్మెల్యేలపై అంత అపనమ్మకమేల? వారిని నిర్బంధించి శిక్షిస్తున్నారని అన్నారు. భాజపా ప్రతిపక్షంలోనే ఉంటుందని స్పష్టంగా ప్రకటించినా శివసేన తమ ఎమ్మెల్యేలను హోటళ్లలో ఎందుకు దాస్తోందని ఫడణవీస్ ప్రశ్నించారు.

శివసేన కార్యనిర్వాహక అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే సీఎంగా గురువారం సాయంత్రం ముంబయిలోని శివాజీ పార్కు మైదానంలో ప్రమాణస్వీకారం చేసిన విషయం తెలిసిందే. అంతేకాకుండా శివసేన, ఎన్సీపీ, కాంగ్రెస్ నుంచి ఇద్దరేసి చొప్పున మొత్తం ఆరుగురు నేతలు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. ఆ తర్వాత కొద్ది సేపటికే సహ్యాద్రి అతిథి గృహంలో కొత్త కేబినెట్ భేటీ అయింది.

# శ్రీలంక ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి సహకరిస్తాం

## - ప్రధాని నరేంద్ర మోదీ

### - మోదీతో భేటీ అయిన శ్రీలంక అధ్యక్షుడు రాజపక్స
### - భారత్, శ్రీలంక సంబంధాలు మరింత బలోపేతమవుతాయని వెల్లడి

న్యూఢిల్లీ, నవంబర్30(ఆర్ఎన్ఎ) : శ్రీలంక ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి సహకరిస్తామని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. శుక్రవారం శ్రీలంక అధ్యక్షుడు గొటబయా రాజపక్స ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. అనంతరం ఢిల్లీలో ఆ ఇద్దరూ సంయుక్తంగా విలేకరులతో మాట్లాడారు. ప్రజలు మీకు ఇచ్చిన తీర్పు.. దేశాన్ని బలంగా చూడాలనుకుంటున్న కాంక్షను తెలియజేస్తుందని శ్రీలంక అధ్యక్షుడిని ఉద్దేశించి మోదీ అన్నారు. శ్రీలంక బలంగా ఉండడం వల్ల అది భారత్‌కే కాదు, యావత్ హిందూ మహాసముద్ర ప్రాంతానికి మంచిదన్నారు. రెండు దేశాల మధ్య బంధం బలంగా ఉందన్నారు. నైబర్‌హుడ్ ఫస్ట్ అన్న విధానానికి ప్రాముఖ్యత ఇస్తామని మోదీ అన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ ఎప్పుడు పోరాటం చేస్తూనే ఉందని, ఉగ్రవాదంపై పోరు చేస్తున్న శ్రీలంకకు 50 మిలియన్ల డాలర్లు ఇవ్వనున్నట్లు మోదీ చెప్పారు. శ్రీలంక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు 400 మిలియన్ల డాలర్లు ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. హౌజింగ్ ప్రాజెక్టులో భాగంగా సుమారు 46వేల ఇండ్లను శ్రీలంకలో నిర్మించినట్లు చెప్పారు. తమిళ ప్రజలకు 14వేల ఇండ్లు నిర్మించినట్లు తెలిపారు. అనంతరం శ్రీలంక అధ్యక్షుడు గొటబయా రాజపక్స మాట్లాడుతూ.. శ్రీలంక చెరలో ఉన్న భారతీయ జాలర్లలను అందర్నీ రిలీజ్ చేస్తున్నట్లు తెలిపారు. భారత్, శ్రీలంక మధ్య చిరకాల సంబంధాలు ఉన్నాయని, తన హయాంలో ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకు వెళ్లాలనుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఇరుదేశాల ఆర్థికాభివృద్ధి, ప్రజల భద్రతకు కొలంబో, న్యూఢిల్లీ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. శ్రీలంక అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇది నా మొదటి విదేశీ పర్యటన అని అన్నారు. భారత ప్రభుత్వానికి, రాష్ట్రపతికి, ప్రధానికి నా కృతజ్ఞతలు అని రాజపక్స అన్నారు. ఎన్నో అంచనాలతో తాను భారత్ పర్యటనకు వచ్చానని, ఒక దేశాధ్యక్షుడిగా తన హయాంలో ఇరుదేశాల మధ్య ఉన్న సంబంధాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకువెళ్లాలని కోరుకుంటున్నానని, ఇరుదేశాల మధ్య చిరకాలంగా బలమైన మైత్రి, సాంస్కృతిక, రాజకీయ సంబంధాలున్నాయని చెప్పారు. రాజపక్సకు రాష్ట్రపతి భవన్ వద్ద రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధాని మోదీ సాదర స్వాగతం పలికారు. అనంతరం భారత విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్‌ను రాజపక్స కలుసుకున్నారు. ప్రధాని, రాజపక్స మధ్య శుక్రవారం హైదరాబాద్ హౌస్‌లో చర్చలు జరుగనున్నాయి. ద్వైపాక్షిక సంబంధాల బలోపేతం, పరస్పర సహకారంపై ఉభయులూ చర్చించనున్నారు. అనంతరం సంయుక్త ప్రకటన చేస్తారు. శనివారం ఢిల్లీలో జరిగే ఓ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం రాజపక్స తిరిగి శ్రీలంక బయలుదేరి వెళ్తారు.

# హీరో రాజశేఖర్‌కు షాక్!

## - డ్రైవింగ్ లైసెన్స్ రద్దుచేసిన ట్రాఫిక్ పోలీసులు

హైదరాబాద్,నవంబర్30(ఆర్ఎన్ఎ): సినీ హీరో రాజశేఖర్‌కు ట్రాఫిక్ పోలీసులు షాక్ ఇచ్చారు. రాజశేఖర్ డ్రైవింగ్ లైసెన్స్ ను రద్దు చేయాలనీ పోలీసులు ప్రతిపాదించినట్టు తెలుస్తుంది. దీనిపై ఇప్పటికే సైబరాబాద్ పోలీసులు ఆర్టీఏకి లేఖను రాశారు. ఇటీవల రాజశేఖర్ కారు ప్రమాదానికి గురవగా.. అంతకుముందు కూడా రాజశేఖర్ కారు ప్రమాదానికి గురైంది. అయితే రెండు ప్రమాదాల్లో కూడా రాజశేఖర్ కు అదృష్ట వశాత్తు ఏమీ జరగలేదు. 2017 అక్టోబర్ 9న రాజశేఖర్ కారు తొలిసారి ప్రమాదానికి గురైనప్పుడు ఆల్కహాలు తీసుకొని డ్రైవింగ్ చేశాడంటూ అతనిపై కేసు నమోదు అయ్యింది. రాజశేఖర్ యాక్సిడెంట్ చేశాడని భాదితుడు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు డ్రంకన్ డ్రైవ్ పరీక్ష నిర్వహించగా, ఈ పరీక్షల్లో రాజశేఖర్ మద్యం తీసుకోలేదని తేలింది. అయితే రీసెంట్‌గా హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై పరిమితికి మించిన వేగంతో కారు నడపడంతో హీరో రాజశేఖర్ కారు అదుపు తప్పి మూడు పల్టీలు కొట్టింది. సమయానికి ఎయిర్ బెలూన్స్ తెరుచుకోవడంతో రాజశేఖర్ పెను ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. అయితే ఓఆర్ఆర్ పై రాష్ డ్రైవింగ్ చేసిన కారణంగా ఆయన డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేయాలని సైబరాబాద్ పోలీసులు ఆర్టీఏ వాళ్లకు లేఖ రాశారు. దీంతో మరికొన్ని రోజుల్లో రాజశేఖర్ కారు లైసెన్స్ రద్దు కానుంది. ఇప్పటికే హీరో రాజశేఖర్ ట్రాఫిక్ నిబంధలను పలు మార్లు ఉల్లఘించడంతో పోలీసులు ఈ నిర్ణయం తీసుకున్నట్టుగా తెలుస్తోంది.

## సమ్మె నోటీసులిచ్చినప్పుడు..
# కార్మికులు బిడ్డల్లా కనిపించలేదా?

- 52రోజుల సమ్మెకు, ఆర్టీసీ నష్టాలకు బాధ్యులెవరు
- ఆర్టీసీని నిర్వీర్యం చేసేందుకు కేసీఆర్ కుట్ర
- యూనియన్లు లేవనడానికి కేసీఆర్ ఎవరు?
- చార్జీల పెంపుతో రోజుకు రూ. 2.98 కోట్ల అదనపు ఆదాయం

### - కాంగ్రెస్ ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి

హైదరాబాద్, నవంబర్30(ఆర్ఎన్ఎ) : ఆర్టీసీ కార్మికులు 52రోజులు రోడ్డుపై పోరాడి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చిన తరువాత వారు సీఎం కేసీఆర్‌కు బిడ్డల్లా కనిపిస్తున్నారని, సమ్మె నోటీసులిచ్చినప్పుడు కార్మికులు బిడ్డల్లా కనిపించలేదా అని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం జీవన్‌రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు.. ఆర్టీసీ సమ్మెపై నోటీసులు ఇచ్చినప్పుడే కేసీఆర్‌కు ఎందుకు పెద్ద బుద్దిలేదని ప్రశ్నించారు. 52రోజుల సమ్మెకు, ఆర్టీసీ నష్టాలకు ఎవరు బాధ్యులని ప్రశ్నించారు. ఆర్టీసీ కార్మికులను విధుల్లోకి చేర్చుకుంటూ.. చార్జీలను పెంచుతూ ప్రజల దృష్టిని కేసీఆర్ మళ్లించారని ఆయన వ్యాఖ్యానించారు. ఆర్టీసీ చార్జీల పెంపుతో రోజుకు రూ. 2.98 కోట్ల అదనపు ఆదాయం రాగా... సంవత్సరానికి వెయ్యి కోట్లకు పైగా ఆదాయం వస్తుందని ఆయన వెల్లడించారు. పల్లె వెలుగు బస్సులకు 32 శాతం బస్ ఛార్జీలు పెంచుతున్నారని, ఆరు సంవత్సరాల నుండి ఆర్టీసీ నష్టాలకు సీఎం బాధ్యుడు కాదా అని ఆయన విమర్శించారు. ఇక ఆర్టీసీ కార్మికుల మరణాలకు సీఎం కేసీఆరే బాధ్యత వహించాలని అన్నారు. మిగతా రాష్ట్రాల్లో డీజిల్ పెంపు భారాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు భరించాయి కానీ తెలంగాణ ప్రభుత్వం మాత్రం ఆర్టీసీపైనే భారం వేసిందని దుయ్యబట్టారు. నిన్నటి వరకు రూట్లు ప్రైవేట్ పర్మిట్ చేస్తామని చెప్పింది రాష్ట్ర ప్రభుత్వం కాదా, ప్రతిపక్షాలు చెప్పాయా అని జీవన్‌రెడ్డి ప్రశ్నించారు. ప్రైవేట్‌పరం చేస్తే ఆర్టీసీ తారీఫ్‌తో నడుపరని ముందే చెప్పారన్నారు. ఆర్టీసీ కార్మికులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేస్తుంది కదా.. ఏపీ ముఖ్యమంత్రి నీకంటే చిన్నవాడన్నారు. ఆయనకు అనుభవం తక్కువే అయినప్పటికీ అక్కడి కార్మికుల శ్రేయస్సు కోసం పని చేస్తుంటే తెలంగాణలో నువ్వు ఎందుకు చేయవని ధ్వజమెత్తారు. అలాగే ఆర్టీసీ యూనియన్లు లేవని చెప్పడానికి నువ్వు ఎవరంటూ ఆయన ప్రశ్నించారు రు. అలాగే దసరా ముందే ఆర్టీసీ కార్మికులను ప్రగతి భవన్కు పిలిచి మాట్లాడితే సమస్య పరిష్కరం అయ్యేది కదా అని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్ ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ముఖ్యమంత్రినని అనుకోకుండా.. ఓ రాజులా, నియంతలాగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఇక ఆర్టీసీ కార్మికులను తొలగిస్తే ప్రభుత్వానికి ఇబ్బందులు తప్పవు అని ఇంటలిజెన్స్ రిపోర్ట్ ఇవ్వడంతో సీఎం కేసీఆర్ వెనక్కి తగ్గారని తెలిపారు. ఇక చనిపోయిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇవ్వడం వారి హక్కు అని.. అయితే కేసీఆర్ ఏదో వారికి భిక్ష పెట్టినట్లు మాట్లాడుతున్నారని జీవన్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

# మరుగుదొడ్ల నిర్మాణాలకు పెద్దపీట

ఆదిలాబాద్,నవంబర్30(ఆర్ఎన్ఎ): గ్రామాల్లో మరుగుదొడ్ల నిర్మాణం సాగుతోందని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి అన్నారు. ప్రభుత్వం ఇందుకు నిధులు వెచ్చిస్తోందని అన్నారు. జిల్లాకేంద్రమైన ఆదిలాబాద్ పట్టణాన్ని బహిరంగ మలవిసర్జన రహిత పట్టణంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ ఇచ్చిన ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. పట్టణంలో పలు కుటుంబాలకు మరుగుదొడ్లులేవని అలాంటి వారిని గుర్తించి తక్షణం మరుగుదొడ్ల నిర్మాణానికి పనిచేయాలన్నారు. హరితహారం కింద నాటిన మొక్కలను పరిరక్షించేందుకుగాను, నర్సరీల ద్వారా కొత్తమొక్కల పెంపకానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇప్పటికే నాటిన మొక్కలను రక్షించే బాధ్యత గ్రామపంచాయితీలదేనని అన్నారు. అలాగే వచ్చేయేడుకు ఇప్పటినుంచే ప్రణాళిక సిద్ధంగా ఉందన్నారు. పట్టణంలో ప్లాస్టిక్‌వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని, విక్రయాలు జరిపేవారిపై జరిమానాలు విధించాలన్నారు.

# చిన్న పొరపాటుతో దారుణఘటన

### ప్రియాంక 100కు ఫోన్ చేసివుంటే మరోలా ఉండేది
### హోం మంత్రి మహ్మూద్ అలీ వ్యాఖ్య
### ప్రియాంక కుటుంబసభ్యులకు పరామర్శ

హైదరాబాద్,నవంబర్30(ఆర్ఎన్ఎ): దేశ వ్యాప్తంగా సంచలన సృష్టించిన వెటర్నరీ డాక్టర్ ప్రియాంకారెడ్డి ఉదంతంపై తెలంగాణ హోం మంత్రి మహమూద్ అలీ స్పందించారు. ప్రియాంకారెడ్డి హత్యకేసులో నిందితులను కఠినంగా శిక్షిస్తామని పేర్కొన్నారు. ఆమె కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించారు. వెటర్నరీ డాక్టర్ ప్రియాంకరెడ్డి కుటుంబ సభ్యులను రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. ప్రియాంకరెడ్డి హత్య బాధాకరమన్నారు. వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీఇచ్చారు. తన సోదరికి ఫోన్ చేసే బదులు బాధితురాలు 100 నంబరుకు కాల్ చేసి ఉంటే పరిస్థితి మరోలా ఉండేదని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ పటిష్టంగా ఉందని... ప్రియాంకారెడ్డి చేసిన చిన్న పొరపాటు వల్లే ఇంతటి ఘోరం జరిగిందని వ్యాఖ్యానించారు. పోలీసులు సీరియస్‌గా దర్యాప్తు చేస్తున్నారని కేసు దర్యాప్తు పూర్తవుతుందని తెలిపారు. కేసును ఫాస్ట్‌ట్రాక్ కోర్టుకు అప్పగిస్తామన్నారు. నిందితులకు త్వరగా శిక్షపడేలా చూస్తామన్నారు. ఎవరు ప్రమాదంలో ఉన్నా డయల్ 100 నంబర్‌కు ఫోన్ చేయాల్సిందిగా సూచించారు. ఫోన్ వచ్చిన 3 నిమిషాలలోపే పోలీసులు స్పందిస్తారని హోంమంత్రి పేర్కొన్నారు. షాద్‌నగర్‌లో జరిగిన ఘటన విచారకరం. దేశ వ్యాప్తంగా ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. హన్మకొండలో కూడా చిన్నారిపై అత్యాచారం జరిగింది. ఈ కేసులో నిందితుడికి ఉరిశిక్ష పడేలా కఠిన చర్యలు తీసుకున్నాం. ప్రియాంక కేసును కూడా స్వల్పకాలంలో ఛేదించారు. నలుగురిని అరెస్టు చేశారు. లోతుగా విచారణ జరిపించి నిందితులకు శిక్ష వేయిస్తాం. ఇక్కడి పోలీసులు అప్రమత్తంగానే ఉన్నారు. అయితే ఉన్నత విద్యనభ్యసించి కూడా ప్రియాంక ఇలాంటి పొరపాటు చేయడం విచారించదగ్గ విషయం. రాత్రి సమయంలో తన సోదరికి ఫోన్ చేసే బదులు 100కి ఫోన్ చేయాల్సింది. పోలీసులు 3 నిమిషాల్లో అక్కడికి చేరుకునే వారు. పరిస్థితి చేయిదాటి పోకుండా ఉండేది' అని మహమూద్ అలీ పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మండలం చటాన్‌పల్లి గ్రామ శివారులోని రోడ్డు బ్రిడ్జి కింద తగలబడిన స్థితిలో ప్రియాంకారెడ్డి మృతదేహాన్ని పోలీసులు గుర్తించిన విషయం తెలిసిందే. నలుగురు నిందితులు పథకం ప్రకారం ప్రియాంకారెడ్డి స్కూటీ పంక్చర్ అతికిస్తామంటూ ఆమెపై దారుణానికి ఒడిగట్టారు. లారీని అడ్డుపెట్టి అత్యాచారానికి పాల్పడి..అనంతరం హతమార్చారు. ఆ తర్వాత కిరోసిన్ పోసి నిప్పంటించారు. అత్యంత హేయమైన చర్యలకు పాల్పడిని నలుగురిని పోలీసులు 24 గంటల్లోనే అరెస్టు చేశారు. నిందితులది మహబూబ్‌నగర్ జిల్లాగా గుర్తించారు. అయితే తమ ఫిర్యాదుకు వెంటనే స్పందించి ఉంటే.. ప్రియాంక ప్రాణాలతో ఉండేదని ఆమె తల్లిదండ్రులు పోలీసులపై ఆరోపణలు చేస్తున్నారు.

# కార్మికులకు సమ్మెకాలపు జీతాలు చెల్లించాలి

- ఆర్టీసీని ఇష్టమొచ్చినట్లు దోచుకున్నారు
- కార్మిక సంఘాల నేతల డ్యూటీ రిలీఫ్ తొలగించడం చిల్లర చర్య
- డ్యూటీ రిలీఫ్‌పై కార్మికశాఖ కమిషనర్ స్పందించాలి
- కేవలం హక్కుల కోసమే యూనియన్లు లేవు
- అవసరమైతే యూనియన్ల నేతలంతా విధుల్లోకి వెళ్తాం
- తక్షణమే కార్మిక సంఘాల ఎన్నికలు నిర్వహించాలి

### - ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి

హైదరాబాద్, నవంబర్30(ఆర్ఎన్ఎ) : కార్మికులకు సమ్మెకాలపు జీతాలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.. కార్మిక సంఘాల నేతల డ్యూటీ రిలీఫ్ తొలగించడం చిల్లర చర్య అని ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి ఆరోపించారు. చట్ట ప్రకారం కార్మిక నేతలకు కొన్ని మినహాయింపులుంటాయని, కార్మిక సంఘాలకు కల్పించే డ్యూటీ రిలీఫ్‌పై కార్మిక శాఖ కమిషనర్ స్పందించాలని కోరారు. కేవలం హక్కుల కోసమే యూనియన్లు లేవని, అవసరమైతే యూనియన్ల నేతలంతా విధుల్లోకి వెళతామన్నారు. ఆర్టీసీని అధికారులు ఇష్టం వచ్చినట్లు దోచుకున్నారని, తక్షణమే కార్మిక సంఘాల ఎన్నికలు నిర్వహించాలని అశ్వత్థామరెడ్డి డిమాండ్ చేశారు. ఆర్టీసీలో చరిత్రలో ఇది ఓచారిత్రక సమ్మెఅని అన్నారు. కార్మికుల జీతాలు చెల్లించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ వర్తింపచేయాలని, కార్మికుల సమస్యలు తీర్చేలా ప్రభుత్వం ముందుకెళ్లాలని కోరుతున్నామని తెలిపారు. యూనియన్లు ఉండాలా? లేదా?అనేది లేబర్ కోర్టు తేలుస్తుందని తెలిపారు. దశాబ్దాల కాలంగా ట్రేడ్ యూనియన్లు ఉన్నాయని, కార్మిక సంఘాల తో పాటు అనేక సంఘాలు తెలంగాణ పోరాటంలో ముందున్నాయియూనియన్ల నుంచి తొలగిపోయేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కార్మికులతో రెఫరెండం పెట్టి.. యూనియన్లు ఉండాలా? వద్దా? తేల్చండని అశ్వత్థామరెడ్డి డిమాండ్ చేశారు. ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు రవాణాను కాపాడేందుకే తమతో కలిసి పోరాడాయని చెప్పారు. ఆర్టీసీని ప్రైవేటు పరం చేయబోమని చెప్పడం సంతోషదాయకమని అశ్వత్థామరెడ్డి తెలిపారు. బకాయిలు చెల్లించాలని కోరామని, కార్మికుల సమస్యలపై లేబర్ కోర్టులో న్యాయం జరుగుతుందని భావిస్తున్నామని అన్నారు. సమ్మె సమయంలో 31మంది చనిపోవడం చాలా బాధించిదని, వారి కుటుంబాలకు ఉద్యోగం ఇస్తామన్న ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.ఆర్టీసీ కార్మికులకు సెప్టెంబర్ జీతాలు వెంటనే ఇవ్వాలని కోరుతున్నట్లు ఐకాస కో-కన్వీనర్ రాజిరెడ్డి తెలిపారు. యూనియన్లను రద్దు చేసే హక్కు ఎవరికీ లేదని, తెలంగాణ ఉద్యమంలో యూనియన్లు కీలకంగా పని చేశాయని గుర్తు చేశారు. యూనియన్ల వల్ల నష్టం వస్తోందని భావిస్తే.. సరిదిద్దుకుంటామన్నారు.

# ఆర్నెళ్లలో రూ.25వేల కోట్లు అప్పులా!

### - అహంకారంతో ప్రజల నెత్తిన అప్పుల భారం పెడితే ఎలా?
### - ట్విటర్‌లో ఏపీ మాజీ సీఎం చంద్రబాబు నాయుడు
### - రాష్ట్రాన్ని సూసైడ్ ప్రదేశ్‌గా మార్చారు - లోకేష్

అమరావతి, నవంబర్30(ఆర్ఎన్ఎ) : వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో ఏం అభివృద్ధి పనులు చేసిందని అప్పులు తెస్తుందని, ఆర్నెళ్లలో రూ.25వేల కోట్లు అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పుల మయంగా మార్చుతున్నారని ఏపీ మాజీ సీఎం, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు విమర్శించారు. శనివారం ఈ మేరకు ఆయన ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

గత ఆరు నెలల పాలనలో వైసీపీ ప్రభుత్వం సాధించింది ఏదైనా ఉందంటే.. అది అప్పుల్లో రికార్డు సృష్టించడమేనని అన్నారు. ఈ ఆరు నెలల్లో దాదాపు రూ.25వేల కోట్లు అప్పుచేసి ఒక్క అభివృద్ధి పనీ చేయలేదని విమర్శించారు. ఒక్క ఆగస్టులోనే ఐదు సార్లు అప్పు ఎందుకు చేయాల్సి వచ్చిందని ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వం ఇన్ని అప్పులు చేస్తూ... రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచి ఇచ్చానని తిరిగి తనపైనే ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలన చేతకాకపోతే సలహాలు తీసుకోవాలి కానీ, అహంకారంతో ప్రజల నెత్తిన అప్పుల భారం పెడితే ఎలా అని చంద్రబాబు ట్విట్టర్ వేదికగా ప్రశ్నించారు. కేవలం సంక్షేమ పథకాల కోసమే అప్పులు తేవడం సమంజసం కాదని విమర్శించారు. ఇప్పటికే టీడీపీ హయాంలో చేపట్టిన ప్రాజెక్టులను వైకాపా ప్రభుత్వం నీరుగారుస్తుందని, రివర్స్ టెండరింగ్‌ల పేరుతో అదనపు భారం మోపుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీరువల్ల రాష్ట్రం మరింత ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతుందని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైన సీఎం జగన్మోహన్‌రెడ్డి తీరుమార్చుకోని ప్రజలపై రాబోయే కాలంలో భారం పడకుండా చూడాలని అన్నారు.

### జనాన్ని ఇన్నికష్టాలు పెట్టడం ఎప్పుడూ చూడలేదు..

గ్రామ కమిటీల ఏర్పాటుపై టీడీపీ నేతలతో ఆ పార్టీ అధినేత చంద్రబాబు శనివారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. క్షేత్రస్థాయి కార్యకర్తల్లో ఉత్సాహం మెండుగా ఉందన్నారు. కార్యకర్తల్లో పట్టుదల పెరిగిందని.. వాళ్ల ఉత్సాహమే పార్టీకి ఎనలేని బలం అన్నారు. పార్టీ పటిష్టతపైనే అందరూ దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. వైసీపీ ప్రభుత్వంలో 6 నెలల్లో అన్నీ వైఫల్యాలేనని చంద్రబాబు స్పష్టం చేశారు. పేదలు, సామాన్య ప్రజలు ఎన్నో బాధలు పడుతున్నారన్నారు. ఆరు నెలల్లోనే జనాన్ని ఇన్ని కష్టాలు పెట్టడం ఎప్పుడూ చూడలేదన్నారు. వైసీపీ చేతగానితనంతో రాష్ట్రానికి ఎనలేని కీడు చేశారన్నారు.

రైతులు, యువత, మహిళల ఆశలను నీరుగార్చారని చంద్రబాబు పేర్కొన్నారు. ఇన్ని ఆత్మహత్యలు, ఆత్మహత్యాయత్నాలు గతంలో లేవన్నారు. ఇసుక కొరతతో 60మంది ఆత్మహత్యలు దేశంలో ఇదే తొలిసారి అని పేర్కొన్నారు. నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటాయని.. మద్యం ధరలను 150శాతం-200శాతం పెంచారన్నారు. దళారుల రాజ్యంగా రాష్ట్రాన్ని మార్చారన్నారు. పెట్టుబడులన్నీ రాష్ట్రం నుంచి వెనక్కి పోయాయన్నారు. ఆర్థిక సంక్షోభంలోకి రాష్ట్రాన్ని నెట్టారని.. అధికార పార్టీ అరాచకాలను ప్రజల్లో ఎండగట్టాలన్నారు. వీటన్నింటిపై గ్రామాల్లో, వార్డులలో చర్చలు చేయాలన్నారు. పంచాయితీ ఎన్నికల్లోపు పార్టీ కమిటీలన్నీ ఏర్పడాలని చంద్రబాబు స్పష్టం చేశారు.

### రాష్ట్రాన్ని సూసైడ్ ప్రదేశ్‌గా మార్చారు - లోకేష్

ఏపీ సీఎం జగన్ పాలనపై ట్విట్టర్ వేదికగా టీడీపీ ఎమ్మెల్సీ నారా లోకేష్ విమర్శలు గుప్పించారు. ఆరు నెలల్లో మంచి సీఎం అనిపించుకుంటానన్న జగన్ .. రాష్ట్రాన్ని ముంచేసిన సీఎంగా చరిత్రలో నిలిచిపోయారని విమర్శించారు. విధ్వంసంతో ప్రారంభమైన జగన్ పాలనలో.. రాష్ట్రాన్ని సూసైడ్‌ప్రదేశ్‌గా మార్చారని విమర్శించారు. ఎన్నికల ముందు నవరత్నాలు ఇస్తానన్న జగన్.. ఆరు నెలల్లో మాటమార్చి ప్రజల నెత్తిన తైలం రాశారని లోకేష్ ట్వీట్ చేశారు.

# పారిశ్రామికవేత్తలకు తెలంగాణ రెడ్ కార్పెట్

### పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వస్తున్న సంస్థలు

హైదరాబాద్,నవంబర్30(ఆర్ఎన్ఎ): తెలంగాణలో సత్వర పారిశ్రామికాభివృద్ధికి బాటలుపరిచేలా సరికొత్త విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం ముందుకుతీసుకొచ్చింది. దీంతో ఇప్పటికే ఏకగవాక్ష విధానం సత్ఫలితాలు ఇస్తోందని పరిశ్రమలశాఖ మంత్రి కెటిఆర్ అభిప్రాయపడ్డారు. చైనాకుచెందిన ఓ కంపెనీ తాజాగా భారీగా పెట్టుబడులకు ముందుకు వచ్చింది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తరవాత వస్తున్న స్పందన బాగుందన్న అభిప్రాయంలో ప్రభుత్వం ఉంది. పరిశ్రమలకు అనుమతి ప్రకియను సరళీకరించింది. పారిశ్రామిక ప్రాజెక్టులకు అనుమతుల జారీలో పారదర్శకత, జాప్యం నివారణ, సంబంధిత సంస్థలు, అధికారులు బాధ్యతాయుతంగా వ్యహరించేలా కాల వ్యవధితో కూడిన కట్టుదిట్టమైన నిబంధనలను ప్రతిపాదించింది. ఇది అమల్లోకి రావడంతో పారిశ్రామిక అనుమతులకు ఏకగవాక్ష విధానం అనుకూలంగా ఉందని ఇటీవల కొన్ని పరిశ్రమలు అనుమతలు విషయాలను బట్టి తెలుస్తోంది. . దీనివల్ల పరిశ్రమలు పెట్టాలనుకున్న వారికి పెద్దగా తలనొప్పులు ఉండబోవు. కార్యాలయాల చుట్టూ పరుగెత్తాల్సిన అవసరం రావడం లేదు. అదే సమయంలో పారిశ్రామికవేత్తలూ నిబంధనలకు బద్ధులయ్యేలా పలు జాగ్రత్తలు తీసుకొంది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక ప్రాజెక్టు అనుమతి, స్వీయ ధ్రువీకరణ విధాన చట్టం- (టీఎస్ఐపాస్) ను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఇది పారిశ్రామికవేత్తలను కూడా ఆకట్టుకునేలా ఉంది. అంతేగాకుండా వారు సైతం ఈ విధానాన్ని ఆహ్వానిస్తున్నారు. తెలంగాణలో పారిశ్రామికాభివృద్ధికి, పెట్టుబడులకు అనువైన వాతావరణాన్ని కల్పించడం, పరిశ్రమలకు అనుమతులు ఒకే చోట మంజూరు చేసి, వాణిజ్య ఉత్పత్తులను వెంటనే ప్రారంభించేలా చేయడం దీని లక్ష్యంగా నిర్దేశించారు. ప్రభుత్వం ఈ విధానం ద్వారా పారదర్శకతను వెల్లడించింది. నోడల్ ఏజెన్సీలు ఇక చురుకుగా పనిచేస్తున్నాయి. దీంతో పారిశ్రామికవేత్తలకు సులువుగా అనుమతులు వస్తున్నాయి. భారీ పరిశ్రమలకు అనుమతుల మంజూరు కోసం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన పరిశ్రమల శాఖ కార్యదర్శి కన్వీనర్‌గా రాష్ట్ర పెట్టుబడులు, సదుపాయాల మండలి ఏర్పాటయ్యింది. రాష్ట్రస్థాయి పరిశ్రమల కమిటీ పంపే ప్రతిపాదనలను ఇది పరిశీలించి 15 రోజులలో సూత్రప్రాయ ఆమోదం తెలుపుతోంది. ఆ తర్వాత తుది అనుమతులిస్తుంది. పారిశ్రామికవేత్తలను ఆకర్షించి పెట్టుబడులను పెట్టేలా వాతావరణాన్ని సమకూర్చారు. దరఖాస్తు చేసుకొని వెళ్లిపోతే మొత్తం అనుమతుల పక్రియకు ప్రభుత్వానిదే పూర్తి బాధ్యత అని, పారిశ్రామికవేత్తల ఇంటికి వాటిని పంపిస్తామని వెల్లడించారు. ప్రపంచదేశాలతో పోల్చితే భారత్‌లో పెట్టుబడులే లాభదాయకంగా ఉంటాయి. అందునా హైదరాబాద్‌లో పెడితే మరింత లాభదాయకంగా ఉంటుందని ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రకటించారు. ఇక్కడి వాతావరణం, నిరంతర విద్యుత్ అందుబాటులో ఉండడం కూడా కలసి వస్తోంది. ఇలా పారిశ్రామిక పెట్టుబడులకు భరోసా కల్పించారు. ఇక్కడ ఉన్న వసతులు, అవకాశాలను వివరించి ఆకట్టుకుంటున్నారు.

# ఆదర్శంగా అంకాపూర్ రైతులు

### పంటల అమ్మకంలోనూ ముందు చూపు
### అభినందిస్తున్న అధికారులు

నిజామాబాద్,నవంబర్30(ఆర్ఎన్ఎ): అంకాపూర్ రైతులు వ్యవసాయంలో సాధించిన విజయాలు అందరికీ ఆదర్శమని జిల్లా వ్యవసాయాధికారులు అన్నారు. ఇప్పుడు ముందస్తు ధరల ఒప్పందం ఓ కీలక మలుపని అన్నారు. వేసిన పంటలను కొనుగోలుచేసేలా వ్యాపారులతో రైతులు ఒప్పందం చేసుకుని ఆదర్శంగా నిలిచారని అన్నారు. ఎర్రజొన్న పంటలకు ముందే ధరలు నిర్ణయించి ఒప్పందాలు చేసుకున్నారు. ఇకపోతే ఇక్కడి రైతులు వర్షాభావ పరిస్థితుల్లోనూ వారు మొక్కవోని ధైర్యంతో ఉన్ననీటిని ఆధరం చేసుకుని పంటలు పండిస్తున్నారని అన్నారు. ఇక్కడ అవలంబిస్తున్న విధానాలు అందరికీ బాగా నచ్చాయన్నారు. ఇవన్నీ రైతుల విజయగాథలని అన్నారు. వ్యవసాయం చేసే ప్రతి ఒక్కరూ ఈ విధానాలు తెలుసుకుని తమకు అనుకూలంగా మార్చుకుని సాగాలని అన్నారు. అంకాపూర్‌లో వ్యవసాయ విధానాలను పరిశీలించాల న్నారు. అంకాపూర్‌లో రైతులందరికీ కూడా 5 నుంచి 10 ఎకరాలకు మించి భూమి లేదని తెలుసుకో వాలన్నారు. శివారులో భూములు కొనుగోలు చేసిన రైతులకు కూడా సీఎం కేసీఆర్ హామీ ఇచ్చిన బిందుసేద్యం పరి కరాల రాయితీ ఇవ్వాలని, పంట ఉత్పత్తులు ఆరబెట్టేందుకు సిమెంటు ప్లాట్‌ఫాంల ఏర్పాటుకు రాయితీ ఇచ్చి నిధులు ఇవ్వాలని ఇక్కడి రైతులు కోరారు. పసుపు పంటలో ఎక్కువ దిగుబడి సాధించేందుకు ప్రభుత్వం నుంచి కొత్త వంగడాలు అందించాలని రైతులు కలెక్టర్‌ను కోరారు. ఇటీవల వివిధ దేశాల బృందాలు కూడా ఇక్కడ పర్యటించి పంటల తీరును పరిశీలించారు. రైతులతో సమావేశమైన పూర్తి వివరాలు తెలుసుకు నేందుకు రైతులతో చర్చించారు. ఇక్కడ పండించే పసుపు, ఎర్రజొన్న, కూరగాయలు, నేల స్వభావం, నల్లమట్టి, సేంద్రియ ఎరువుల వాడకం, పంటల సాగు, మార్కెట్ చేసే విధానాలపై రైతులతో చర్చించారు. గతంతో నిజాంసాగర్ ద్వారా కాలువ నీరు, బావి ఎర్రజొన్న మూలవిత్తనాలు పండించిన తర్వాత మార్కెట్ చేసే విధానం గురించి రైతులు వివరించారు. వ్యవసాయ భూము ల్లో నల్లమట్టిని వేసేందుకు గతంలో శ్రీరా ంసాగర్ ప్రాజెక్టు పరివాహక ప్రాంతం నుం చి టిప్పర్లలో తీసుకువచ్చినట్లు రైతులు తెలిపారు.

## అధికారిక నివాసం ఖాళీ చేసిన ఫడ్నవీస్
# కొత్త ఇంటి కోసం వెతుకులాట

ముంబయి,నవంబర్30(ఆర్ఎన్ఎ): మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ సీఎం అధికారిక నివాసమైన 'వర్ష' బంగళాను గురువారం రాత్రి ఖాళీ చేశారు. కొత్త ఇంటి కోసం ఆయనవేట మొదలుపెటట్‌ఆరు. మహారాష్ట్ర కొత్త సీఎంగా ఉద్ధవ్ ఠాక్రే గురువారం సాయంత్రం ప్రమాణస్వీకారం చేయడంతో దక్షిణ ముంబయిలోని సీఎం అధికారిక నివాసం నుంచి మాజీ ముఖ్యమంత్రి ఫడణవీస్ తన సామాన్లను ప్రొఫెషనల్ ప్యాకర్స్ అండ్ మూవర్స్ కంపెనీ లారీల్లో తీసుకువెళ్లారు. నాగపూర్ నగరానికి చెందిన ఫడణవీస్ ముంబయిలో కొత్త ఇల్లు దొరికేవరకు మెట్రోపోలిస్ భవనంలో తాత్కాలికంగా ఉంటున్నారు. ఫడణవీస్ భార్య అమృత యాక్సిస్ బ్యాంకులో సీనియర్ అధికారిగా పనిచేస్తున్నారు. ఈయన కుమార్తె ముంబయిలోనే చదువుతున్నారు. దీంతో ఐదేళ్ల క్రితం సీఎం అయ్యాక ఫడణవీస్ తన కుటుంబాన్ని ముంబయికు మార్చారు. నాగపూర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన ఫడణవీస్ కొత్త అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడి పాత్ర పోషించనున్నారు. కాగా కొత్త సీఎం ఉద్ధవ్ ఠాక్రే నివాసం 'మాతోశ్రీ' బాంద్రా సబర్బన్ ప్రాంతంలో ఉంది. కొత్త సీఎం ఉద్ధవ్ ఠాక్రే తన సొంత నివాసమైన మాతోశ్రీని వదిలి సీఎం అధికారిక నివాసమైన 'వర్ష'కు మారుతారా లేదా అనేది ఇంకా అధికారికంగా తేలలేదు.

## టీఆర్ఎస్ ప్రభుత్వం ఎల్లప్పుడు ప్రజల వెంటే
# ఆర్టీసీ కార్మికులను ఒంటరి చేసిన విపక్షాలు

## -పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్,నవంబర్30(నేటినిజం ప్రతినిధి): టీఆర్ఎస్ ప్రభుత్వం,సిఎం కెసిఆర్ ఎల్లప్పుడు ప్రజల వెంటే ఉంటారని టీఆర్ఎస్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. ఆ కోవలోనే అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. టీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు తిరిగి టీఆర్ఎస్‌ను గెలిపించుకున్నారని అన్నారు. గత 60 ఏండ్ల పాలనలో కాంగ్రెస్, టీడీపీ నాయకులు ప్రజలకు ఏమి చేశారని ఆమె కాంగ్రెస్, టీడీపీ నాయకులను ప్రశ్నించారు. మొన్నటికి మొన్న ఆర్టీసీ కార్మికులకు నమ్మించి మోసం చేశారని అన్నారు. వారిని రోడ్డున పడేస్తే మళ్లీ కెసిఆర్ మాత్రమే ఆదుకున్నారని అన్నారు. రైతు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న సీఎం కేసీఆర్‌ను ప్రజలనుంచి వేరు చేయలేరని అన్నారు. సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను చూసి ఇతరరాష్ట్రాల్లో అమలుకు ప్రయత్నిస్తున్నారని ఆమె తెలిపారు. పనిచేసే ప్రభుత్వాన్ని ఎన్నుకుంటే ప్రజల కష్టాలు తీరుతాయని నమ్మిన ప్రజలు కెసిఆర్‌ను గెలపించారని అన్నారు. తంతువులు, వృద్ధులు, వికలాంగులు, బీడీ కార్మికులు, ఒంటరి మహిళలకు నెలనెలా పింఛన్‌లను అందజేస్తూ సీఎం కేసీఆర్ ఆసరాను కల్పిస్తున్నారన్నారు. టీఆర్ఎస్ ప్రభంజనాన్ని చూసి ఓర్వలేకే కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేస్తున్నారు.

# పార్టీలకు అతీతంగా గ్రామాల అభివృద్ధి

మెదక్,నవంబర్30(నేటినిజం ప్రతినిధి): పార్టీలకు అతీతంగా చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను ప్రజలు ఆదరిస్తున్నారని నర్సాపూర్ టీఆర్ఎస్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అన్నారు. అందుకే ప్రజలు కెసిఆర్ అంటే అభిమానంతో ఉన్నారని అన్నారు. ఆర్టీసీ కార్మికుల విషయంలో యూనియన్లు, విపక్షాలు చేసిన యాగీ అంతాఇంతా కాదన్నారు. అయినా మళ్లీ సిఎం కెసిఆర్ పెద్దమనసుతో ఆదుకున్నారని చెప్పారు. కార్మికులకు అండగా నిలిచారని చెప్పారు. విపక్షాలు ఎంతసేపు ప్రభుత్వాన్ని విమర్శించడమే పనిగా పెట్టుకున్నాయని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ పనిచేస్తున్నారని అన్నారు. నర్సాపూర్ నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు శాశ్వత సాగునీటిని అందించడమే తన జీవిత లక్ష్యమని పేర్కొన్నారు. అలాగే టీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం అన్నారు. తెలంగాణ అభివృద్ధిని జీర్ణించుకోలేని కాంగ్రెస్, టీడీపీలు విమర్శలు చేస్తున్నాయని చెప్పారు. ఇలాంటి నాయకులను నమ్మి మోసపోవద్దని ఆర్టీసీ కార్మికులకు ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ కోసం అహర్నిశలూ శ్రమిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ మాత్రమే ప్రజల బాగోగులను పట్టించుకోగలరని అన్నారు.

# భూ సర్వేతో వివాదాలకు చెక్ పెట్టాం

## రైతుబంధుతో ఆదుకున్నాం: ముత్తిరెడ్డి

జనగామ,నవంబర్30(ఆర్ఎన్ఎ): భూ రికార్డుల ప్రక్షాళనతో గ్రామాల్లో భూ వివాదాలకు చెక్ పడిందని, ఇది టిఆర్ఎస్ ఘనత మాత్రమేనని జనగామ టిఆర్ఎస్ ఎమ్మెల్యే ముత్తి రెడ్డి యాదగిరి రెడ్డి అన్నారు. ఇందుకు సర్వే ద్వారా ఎవరి భూమి ఎక్కడ అన్నది తెలియచేసి పాస్ పుస్తకాలు అందించిన ఘనత కెసిఆర్‌దని అన్నారు. అక్కడక్కడా కొన్ని సమస్యలు ఉన్నా ప్రధానంగా సమస్యలును తీర్చిన ఘనత తమ ప్రభుత్వానిదన్నారు. గ్రామాల్లో వివిధ రకాల భూ వివరాలు గందరగోళంగా ఉండడంతో అనేక సమస్యలు దీంతో పరిష్కారం అయ్యాయని అన్నారు. రికార్డుల్లో పట్టాదారు కాలంలో ఒకరు, వాస్తవ కబ్జాలో మరొకరి పేరిట పహాణీలు, పట్టాదారు పాసుపుస్తకాలు ఉండడంతో ప్రభుత్వం గతేడాది సర్వేకు ఆదేశించిందన్నారు. దశాబ్దాలుగా రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించేందుకు సర్వే తోడ్పడిందని అన్నారు. భూ సంబంధిత వివాదాలకు చెక్ పడిందన్నారు. ఇకపోతే . సీఎం కేసీఆర్ చేపట్టిన పథకాలు దేశానికి ఆదర్శమన్నారు. మల్లన్న సాగర్ నీళు వస్తే.. మన ప్రాంతం సస్యశ్యామలం కానుందన్నారు. 24గంటల కరంట్ ఇస్తున్న తెలంగాణ ప్రభుత్వానికే దక్కిందన్నారు. కాళేశ్వరం నీళ్లు వస్తే.. కరువు దూరం అవుతుందన్నారు.

# ప్రజల సమస్యలపై నిర్లక్ష్యం తగదు:గుండా మల్లేశ్

ఆదిలాబాద్,నవంబర్30(ఆర్ఎన్ఎ): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల పట్ల నిర్లక్ష్యం వహిస్తోందని మాజీ ఎమ్మెల్యే గుండా మల్లేషం అన్నారు.కెసిఆర్ కుట్రలను ప్రజలు అర్థం చేసుకుంటున్నారని అన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఉపాధి హామీ కార్మికులకు 300 రోజులు పనిదినాలు కల్పించి వారికి రోజుకు రూ.310 కూలీగా చెల్లించి వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. ఉపాధిహామీ కూలీలకు వారం కోసారి కూలీడబ్బులు చెల్లించాల్సి ఉండగా మూడు, నాలుగు నెలలకోసారి కూలీలు అందించాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. దళితులకు ప్రభుత్వం అందించే భూమి కొనుగోలు పథకంలో మొదటి ప్రాధాన్యంగా చూడాలని అన్నారు. కార్మికులకు రెండుపడకల గదుల ఇళ్లను అందించి వారిని ఆదుకోవాలని అన్నారు. కార్మికులకు సంక్షేమ ఫలాలు అందకుంటే ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఇకపోతే టైగర్ జోన్ పేరిట అడవుల నుంచి గిరిజనులను పంపేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆరోపించారు. జిల్లాలో 2,600 ఎకరాల్లో పోడు భూములున్నాయని, వాటిని గిరిజనుల నుంచి లాక్కునేందుకు సర్కారు ప్రయత్నిస్తోందన్నారు. దళితులకు, గిరిజనులకు మూడెకరాల భూమిని ఇస్తామని చెబుతున్న పాలకులు భూములు పంపిణీ చేయడం పక్కన బెడితే ఉన్న భూములను లాక్కునే ప్రయత్నం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. వాటిని సరిచేసి అందరికీ న్యాయం చేస్తామని అన్నారు. లక్షల కోట్ల రూపాయలను ఎగవేసి దేశం విడిచి పారిపోయిన విజయ్‌మాల్యా లాంటివాళ్లను శిక్షించకుండా సామాన్యులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. జీఎస్టీ,నోట్ల రద్దు కార్పొరేట్ సంస్థలకు వేల కోట్ల రూపాయలు సమర్పించేందుకే కేంద్ర ప్రభుత్వం పని చేసిందని, తద్వారా సామాన్యులను ఇబ్బందులకు గురి చేస్తోందని మల్లేశం ఆరోపించారు.

# నా కొడుకును కాల్చి చంపేయాలి

## -రేపిస్ట్ చెన్నకేశవులు తల్లి ఆవేదన

మహబూబ్‌నగర్,నవంబర్30(ఆర్ఎన్ఎ): నగర శివారు శంషాబాద్ వద్ద వెటర్నరీ డాక్టర్ ప్రియాంక రెడ్డిపై సామూహిక అత్యాచారం చేసి హత్య చేసి తగులబెట్టిన ఘటన దేశవ్యాప్తంగా కలకలం రేపుతోంది. నిర్భయ ఘటన తర్వాత మరోసారి అందరినీ కదిలించిన ఈ ఘటనపై ప్రాంతాలకు అతీతంగా ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ఈ దారుణానికి పాల్పడిన నిందితులను బహిరంగంగా ఉరితీయాలంటూ డిమాండ్ పెరుగుతోంది. ఈ కేసులో నలుగురు నిందితులు.. ఏ-1 మహ్మద్ ఆరిఫ్ (26), ఏ-2 జొల్లు శివ (20), ఏ-3 జొల్లు నవీన్ (20), ఏ-4 చింతకుంట చెన్నకేశవులు (20) ఈ ఘాతుకానికి పాల్పడినట్లు పోలీసులు నిర్ధారించి వారిపై కేసులు నమోదు చేశారు. ఈ నేపథ్యంలోనే నలుగురు నిందితుల్లో ఒకటైన చెన్నకేశవులు తల్లి జయమ్మ ఈ ఘటనపై దిగ్భ్రాంతిని వ్యక్తంచేసింది. నా కొడుకు ఇలా చేస్తాడని అనుకోలేదని, ఓ అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకున్నా మేమేమీ అనలేదన్నారు. వాడికి కిడ్నీ వ్యాధి ఉందని, గతంలో మంచిగానే ఉండేవాడని, మహ్మద్ ఆరిఫ్‌తో తిరగడం మొదలయ్యాకే చెడిపోయాడని వాపోయింది. లారీ లోడ్ చేయాలని వాడే నా కొడుకును తీసుకుపోయాడని, ఇప్పుడు వాడు చేసిన పనికి ఊర్లో తలదించుకుంటున్నామని ఆమె కన్నీటిపర్యాంతమైంది. కొడుకు చేసిన నిర్వాకంతో నా భర్త ఆత్మహత్య చేసుకోబోయాడని, నాకూ ఆడబిడ్డలున్నారని, ప్రియాంకను ఎలా దారుణంగా చంపారో వాడిని కూడా అలాగే చంపేసినా నేను బాధపడనన్నారు.



పర్యావరణ, అడవుల పెంపకంపై న్యూఢిల్లీలో ఏర్పాటైన సదస్సులో పాల్గొన్న కేంద్ర మంత్రి జవదేకర్, తెలంగాణ అటవీశాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి తదితరులు

### పర్యావరణ పరిరక్షణకు..

# తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక కృషి

**– రాష్ట్రంలో 1.175 కోట్ల మొక్కలు నాటాం**
**– పర్యావరణ, అటవీశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి**

న్యూఢిల్లీ, నవంబర్30(ఆర్ఎన్ఎ) : తెలంగాణలో పర్యావరణ పరిరక్షణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలంగాణ అటవీ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. అన్ని రాష్ట్రాల పర్యావరణ అటవీశాఖ మంత్రుల సమావేశం శనివారం ఢిల్లీలో ప్రారంభమైంది. కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్ అధ్యక్షతన మహారాష్ట్ర సదన్‌లో భేటీ కొనసాగింది. ఈ సమావేశంలో రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పాల్గొన్నారు. అడవుల పరిరక్షణ, ప్రత్యామ్నాయ భూముల్లో అడవులను పెంచడం, తెలంగాణకు హరిత హారం కార్యక్రమం ద్వారా అటవీయేతర ప్రాంతాల్లో మొక్కలు నాటడం, నదీ పరివాహక ప్రాంతాల్లో అడవుల రక్షణ, స్కూల్ నర్సరీ యోజన స్కీమ్ ద్వారా మొక్కలు నాటడంలో విద్యార్థులను భాగస్వాములను చేయడం, తదితర అంశాలపై చర్చించనున్నారు. తెలంగాణలో పర్యావరణ పరిరక్షణకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. 24 శాతం ఉన్న అడవులు 33 శాతానికి పెంచాలనే లక్ష్యాన్ని చేరుకునేందుకు అన్ని విధాల కృషి చేస్తున్నట్లు తెలిపారు. హరితహారం కార్యక్రమం ద్వారా పెద్దఎత్తున మొక్కలు నాటుతున్నట్లు వెల్లడించారు. కొత్తగా మున్సిపల్, పంచాయతీ రాజ్ చట్టాలను తీసుకువచ్చి నాటిని మొక్కల్లో 85 శాతం మొక్కలను కాపాడుకునేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్లాస్టిక్ వాడకం తగ్గించి జూట్, పేపర్ బాగ్స్ వినియోగాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి 1.175 కోట్ల మొక్కలను నాటామని వెల్లడించారు. రాష్ట్రంలో గతంలో 24శాతానికి తగ్గిపోయిన అడవులను 33 శాతానికి పెంచేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. అటవీ శాఖలో ఉన్న పోస్టులను భర్తీ చేస్తున్నామని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ వచ్చాక భూగర్భ జలాలు, అడవులు వృద్ధి చెందుతున్నాయని తెలిపారు. ఢిల్లీ తరహా కాలుష్య పరిస్థితులు దేశంలో ఎక్కడా రాకూడదని కోరుకుంటున్నానన్నారు. ప్లాస్టిక్ వాడకం తగ్గించి జూట్, పేపర్ బాగ్స్ ను వినియోగాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఢిల్లీలో కాలుష్యాన్ని తగ్గించేందుకు కేంద్రం చర్యలు తీసుకోవాలని ఇంద్రకరణ్ రెడ్డి కోరారు.

# మంత్రుల వ్యాఖ్యలు విచిత్రంగా ఉన్నాయి

**– ఆడపిల్లల తల్లిదండ్రులు భయపడుతున్నారు**
**– కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి**

హైదరాబాద్, నవంబర్30(ఆర్ఎన్ఎ) : యువ వైద్యురాలిపై దారుణంగా ఆత్మహత్యకు పాల్పడిన హతమార్చితే.. మంత్రులు వ్యాఖ్యలు విచిత్రంగా ఉన్నాయని కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ప్రియాంక రెడ్డి హత్య కేసుపై జానారెడ్డి స్పందించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట ్లాడుతూ.. ప్రియాంక రెడ్డి హత్య కేసు తర్వాత తెలంగాణలో ఆడపిల్లల తల్లిదండ్రులు భయపడి పోతున్నారని అన్నారు. ఆడపిల్లలు బయటి కెళితే ఇంటి కొచ్చే వరకు తల్లిదండ్రులు భయపడుతూనే ఉంటున్నారని చెప్పారు. ప్రియాంక రెడ్డి హత్య ఘటనపై తెలంగాణ హోం మంత్రి మహమూద్ అలీ, పశుసంవర్ధక మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ చేసిన వ్యాఖ్యలు విచిత్రంగా ఉన్నాయని జానారెడ్డి విమర్శించారు. ఇటువంటి ఘటనలు మరోసారి జరగకుండా ఐపీఎస్ అధికారితో వెంటనే ఒక కంట్రోల్ రూమ్‌ని ఏర్పాటు చేయాలని జానారెడ్డి డిమాండ్ చేశారు. ఇటువంటి సంఘటనలు జరిగినప్పుడు ముఖ్యమంత్రి స్పందించి బాధిత కుటుంబాలను పరామర్శిస్తే బాగుంటుందని, ప్రజల్లోకి మంచి మెసేజ్ వెళ్తుందని చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో ఆడవాళ్లపై ఈగవాలనివ్వనని, ఎవరైనా అత్యాచారాలకు పాల్పడితే కళ్లు పీకేస్తానని చెప్పిన సీఎం కేసీఆర్ నేడు కనీసం అత్యాచారానికి గురైన కుటుంబ సభ్యులను పరామర్శించాలనే అవగాహన కూడా లేదా అంటూ జానారెడ్డి మండిపడ్డారు. ఇలాంటి ఘటనలు మరోమారు పునరావృతం కాకుండా ఉండాలంటే రాష్ట్రంలో పటిష్ఠ నిఘా ఏర్పాటు చేయాలని అన్నారు.

## రాష్ట్రంలో ఆటవిక రాజ్యం నడుస్తోంది: తులసిరెడ్డి

కడప,నవంబర్30(ఆర్ఎన్ఎ): వైసీపీ వస్తే రాష్ట్రంలో రౌడీ రాజ్యం వస్తుందని ఆనాడే చెప్పామని కాంగ్రెస్ సీనియర్ నేత,అధికార ప్రతినిధి తులసీరెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఆటవిక, రౌడీయిజం రాజ్యమేలుతోందని తెలిపారు. ఈ రౌడీరాజ్యం ఎక్కువ రోజులు సాగదన్నారు. ప్రజలు తిరగబడితే రౌడీలు

పలాయనం చిత్తగించక తప్పదన్నారు. ప్రతిపక్ష నేత చంద్రబాబుపై చెప్పులు వేయడం దుర్మార్గమన్నారు. మంత్రులు, నేతలు, కార్యకర్తలు బూతులు మాట్లాడటం హేయంమని తులసిరెడ్డి పేర్కొన్నారు. పాలన చేయాల్సిన వారు విమర్శలు చేస్తూ సవాళ్లు విసురుతూ సాగడం ఎంతవరకు సమంజసమని అన్నారు.

## ఆరేళ్ల కనిష్టానికి ఆర్థికవృద్ధి

### 4.5 శాతానికి పడిపోయిన జీడీపీ

న్యూఢిల్లీ,నవంబర్30(ఆర్ఎన్ఎ): దేశీయ ఆర్థిక వృద్ధి ఊహించినదానికంటే కనిష్టానికి పడిపోయింది. ప్రభుత్వం తాజాగా శుక్రవారం విడుదలచేసిన గణాంకాల ప్రకారం క్యూ2లో జీడీపీ 4.5 శాతానికి పడిపోయింది.

ఇది ఆరేళ్ల కనిష్టం. ప్రైవేట్ పెట్టుబడులు బలహీనపడడం, కన్జ్యూమర్ డిమాండ్ మందగమనం, అంతర్జాతీయ మాంద్య పరిస్థితులు..ఎకానమీపై ప్రభావం చూపినట్టు నిపుణులు భావిస్తున్నారు. జీడీపీ వృద్ధి మరోసారి 5 శాతం కంటే కిందికి పడిపోయింది. మార్చి త్రైమాసికంలో ఇది 4.3 శాతానికి పడిపోయింది. గతంలో 2013 జనవరి–మార్చిలో జీడీపీ 4.3 శాతంగా నమోదయింది.

ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ దేశ ఆర్థిక వృద్ధిలో మందగమనం ఉంది కానీ మాంద్య పరిస్థితులు లేవని, పురోగతికి అనేక చర్యలు తీసుకుంటున్నామని రెండు రోజుల క్రితం ప్రకటించినప్పటికీ సెప్టెంబర్ త్రైమాసికంలో జీడీడీ ఆరున్నర సంవత్సరాల కనిష్టాన్ని నమోదు చేసింది. ఈ ఆర్థిక సంవత్సరం జూలై–సెప్టెంబర్ త్రైమాసికంలో భారత జీడీపీ 4.5 శాతం వృద్ధిని సాధించినట్లు నేషనల్ స్టాటిస్టికల్ విభాగం శుక్రవారం వెల్లడించింది. మరోవైపు దేశీయ ఎకానమీ గత ఆరేళ్లలో అత్యంత కనిష్ఠ వృద్ధిని సెప్టెంబర్ త్రైమాసికంలో నమోదు చేయవచ్చని రాయిటర్స్ పోల్ ఇప్పటికే అంచనావేసిన సంగతి తెలిసిందే. ఇది 4.7 శాతానికి పరిమితం కావచ్చని అంచనా వేయగా, మరింత కిందికి దిగజారడం గమనార్హం.

## ఇంటర్ వార్షిక పరీక్షల షెడ్యూల్ విడుదల

హైదరాబాద్,నవంబర్30(ఆర్ఎన్ఎ): రాష్ట్ర ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల షెడ్యూల్‌ను ఇంటర్ బోర్డు వెల్లడించింది. మార్చి 4 నుంచి 21వ తేదీ వరకు ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలను నిర్వహించ నున్నారు. అదేవిధంగా మార్చి 5 నుంచి 23వ తేదీ వరకు ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షల నిర్వహిస్తారు. కాగా ఫిబ్రవరి 1 నుంచి 20వ తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలు జరగనున్నాయి. జనవరి 28న నైతిక, మానవ విలువల పరీక్ష.. జనవరి 30న పర్యావరణ విద్య పరీక్ష జరగనుంది. ఈ మేరకు పరీక్షల షెడ్యూల్‌ను ఖరారు చేశారు.

# పెద్ద ఎత్తున అడవుల పెంపకం

## –పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట

ఆదిలాబాద్,నవంబర్30(ఆర్ఎన్ఎ): తెలంగాణలో పర్యావరణ పరిరక్షణకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు మాజీమంత్రి జోగురామన్న చెప్పారు. 24 శాతం ఉన్న అడవులు 33 శాతానికి పెంచాలనే లక్ష్యాన్ని చేరుకునేందుకు అన్ని విధాల కృషి చేస్తున్నట్లు తెలిపారు. హరితహారం కార్యక్రమం ద్వారా పెద్దఎత్తున మొక్కలు నాటుతున్నట్లు వెల్లడించారు. కొత్తగా మున్సిపల్, పంచాయతీ రాజ్ చట్టాలను తీసుకువచ్చి నాటిని మొక్కల్లో 85 శాతం మొక్కలను కాపాడుకునేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్లాస్టిక్ వాడకం తగ్గించి జూట్, పేపర్ బాగ్స్ వినియోగాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అడవుల పరిరక్షణ, ప్రత్యామ్నాయ భూముల్లో అడవులను పెంచడం, తెలంగాణకు హరితహారం కార్యక్రమం ద్వారా నెరవేరుతోందని అన్నారు. అడవుల రక్షణ, స్కూల్ నర్సరీ యోజన స్కీమ్ ద్వారా మొక్కలు నాటడంలో విద్యార్థులను భాగస్వాములను చేయడం, తదితర అంశాలపై శ్రద్ధ పెట్టామని అన్నారు. ఇదిలావుంటే ప్రతి గ్రామంలో డంపింగ్ యార్డు, శ్మశాన వాటిక, ఇంకుడుగుంత, నర్సరీల నిర్మాణాలు పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాలని కలెక్టర్ దివ్యదేవరాజన్ అన్నారు. ప్రతి గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టి తడి, పొడి చెత్తను వేరువేరుగా సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. ప్రతి ఇంటికీ ఒక ఇంకుడు గుంత నిర్మించుకు నేలా అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. నర్సరీల ఏర్పాటుకు ప్రణాళిక ప్రకారం నిర్వహించాలని తెలిపారు. పల్లె ప్రణాళిక కార్యక్షికమంలో భాగంగా నాటిన ప్రతి మొక్కలతోపాటు హరితహారం మొక్కలను సంరక్షించాలన్నారు. గ్రామాల్లో మురికి నాలాల నుంచి ఎప్పటికప్పుడు చెత్తను తొలగించి రోడ్లను శుభ్రపర్చాలన్నారు. దోమల నివారణకు మందులు పిచికారీ చేయాలని సూచించారు.

## ప్రియాంక హంతకులను కఠినంగా శిక్షించాలి: కూనంనేని

ఖమ్మం,నవంబర్30(ఆర్ఎన్ఎ): ప్రియాంకారెడ్డి ఘటన చాలా బాధాకరమని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. అఘాయత్యానికి పాల్పడిన నిందితులను తక్షణమే కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పురావృతంకాకుండా కఠిన చర్యలకు ఉపక్రమించాలని అన్నారు. తెలంగాణలో మహిళలకు రక్షణ కరువైందన్నారు. మహిళకు రక్షణ కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయన్నారు. ఘటనకు నైతిక బాధ్యత వహించి కేసీఆర్ రాజీనామా చెయ్యాలన్నారు. విజయవంతమైన ఆర్టీసీ కార్మికుల పోరాటానికి విప్లవ వందనాలు తెలిపారు. చట్టాలపై అవగాహన లేని మూర్ఖుడు కేసీఆర్ అని విమర్శించారు. అమ్మాయిలపై అఘాయిత్యాలు సాగుతున్నా పోలీసులు తగిన చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఫిర్యాదు చేసినా స్పందించక పోవడం దారుణమని అన్నారు.

## కిరీటం దొంగ అరెస్ట్

హైద్రాబాద్,నవంబర్30(ఆర్ఎన్ఎ): ఈనెల 20న హైదరాబాద్‌లోని గన్‌ఫౌండ్రిలో ఉన్న దుర్గ భవాని ఆలయంలో వెండి కిరీటాన్ని ఎత్తుకెళ్లిన దొంగను అబిడ్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ దొంగతనం చేసింది కోఠికి చెందిన అద్వానీ కిరణ్ కుమార్‌గా పోలీసులు గుర్తించారు. అద్వానీ కిరణ్ కుమార్‌ను ఆయన ఇంట్లోనే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అప్పులు తీర్చేందుకే కిరీటాన్ని దొంగిలించి, అమ్మినట్లు కిరణ్ విచారణలో ఒప్పుకున్నాడు. పోలీసులు కిరీటాన్ని స్వాధీనం చేసుకొని నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

## వ్యాధులపట్ల అవగాహన పెంచాలి

### సకాలంలో సిలబస్ పూర్తి చేయాలి: డిఇవో

ఆదిలాబాద్,నవంబర్30(ఆర్ఎన్ఎ): అంటువ్యాధులు ప్రబలకుండా జిల్లాలో విద్యార్థులకు జాగ్రత్తలు చెప్పాలని డిఇవో సూచించారు. అలాగే స్వైన్‌ఫ్లూ,డెంగ్యూ లాంటి వ్యాధులపై వారికి అవగాహన కల్పించాలన్నారు. వ్యాధులు ప్రబలుతున్న దశలో విద్యార్థులు పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం ఇచ్చేలా చూడాలన్నారు. పాఠశాల మైదానంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆ దిశగా ఉపాధ్యాయులంతా కృషిచేయాలని చెప్పారు. ఉపాధ్యాయులందరితో సమన్వయం చేస్తూ పాఠశాల అభివృద్ధికి ప్రధానోపాధ్యాయులంతా పనిచేయాలన్నారు. సిలబస్‌ను సకాలంలో పూర్తిచేసి వెనుకబడిన విద్యార్థుల ప్రగతికి చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాధికారి సత్యనారాయణ అన్నారు. పదోతరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించడంతో వారిని ఉత్తమంగా రాణించేలా చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ఉత్తమ ఫలితాలతో జిల్లాను ఉత్తమంగా నిలపాలన్నారు. విద్యార్థుల్లో గుణాత్మకవిలువలు పెంపొందించేలా ఉపాధ్యాయులంతా కృషిచేయాలని అన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఉన్నతపాఠశాలలో జరుగుతున్న శిక్షణ తరగతుల సందర్భంగా డివివో ఈ సూచన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తమబోధనతో విద్యార్థుల గ్రేడింగ్ ఫలితాలను పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాల నిర్వహణను పకడ్బందీగా చేపడ్తూ విద్యావ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. మధ్యాహ్నభోజన పథకం సక్రమంగా అమలుచేయాలని, రికార్డులను ఎప్పటికప్పుడు నమోదుచేయాలని పేర్కొన్నారు.



ములుగు జడ్పీసమావేశంలో పాల్గొన్న మంత్రులు ఎర్రబెల్లి దయాకర్రావు, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే సీతక్క, ఎంపి మాలోత్ కవిత తదితరులు

# దోషులను కఠినంగా శిక్షించేందుకు చర్యలు: మంత్రి సత్యవతి

ములుగు, నవంబర్ 30: వెటర్నరీ డాక్టర్ ప్రియాంకరెడ్డిపై జరిగిన ఘటన హేయమైందని.. సంఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని.. దోషులను కఠినంగా శిక్షించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ తెలిపారు. ములుగు జడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్ అధ్యక్షతన జిల్లా పరిషత్ సమావేశం నేడు జరిగింది. సమావేశానికి మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్యే సీతక్క, జడ్పీ సీఈఓ, పారిజాతం, జిల్లా అధికారులు, స్థానిక నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సత్యవతి మాట్లాడ ుతూ.. ప్రియాంక కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం ఏ చర్యలైన చేపడుతుందన్నారు. దోషులకు త్వరితగతిన శిక్ష పడేందుకు కేసును ఫాస్ట్‌ట్రాక్ కోర్టుకు అప్పగించనున్నట్లు తెలిపారు.

# ఎన్ఆర్సీ ప్రకటనతోనే పరాజయం

### బెంగాల్ ఉప ఎన్నికల్లో ఓటమిపై అభ్యర్థుల్లో ఆందోళన

కోల్‌కతా,నవంబర్30(ఆర్ఎన్ఎ): అస్సాం తరహాలోనే దేశవ్యాప్తంగా జాతీయ పౌరసత్వ నమోదు (ఎన్ఆర్సీ) కార్యక్రమాన్ని నిర్వహిస్తామని బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా పార్లమెంట్ ముఖంగా ప్రకటించడం పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో జరిగిన మూడు అసెంబ్లీ స్థానాల ఉప ఎన్నికలపై ఎంతో ప్రభావాన్ని చూపిందని బిజెపి నేతలు అంటున్నారు. పర్యవసానంగానే ఖరగ్‌పూర్, కరింపూర్, కలియాగంజ్ నియోజక వర్గాల్లో పాలకపక్ష తృణమూల్ కాంగ్రెస్ చేతుల్లో బీజేపీ అభ్యర్థులు ఓడిపోయారు. లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే ఈ ఉప ఎన్నికల్లో బీజేపీ ఓట్ల శాతం భారీగా పడిపోయిందని ఓడిన నేతలు వాపోతున్నారు.

కలియాగంజ్, కరీంపూర్ అసెంబ్లీ స్థానాలను బంగ్లా సరిహద్దుల్లో ఉన్నాయి. వారిలో బంగ్లాదేశ్ నుంచి వచ్చిన ముస్లింలతోపాటు హిందువులు కూడా గణనీయంగా ఉన్నారు. బంగ్లాదేశ్ నుంచి వలస వచ్చిన వారిని, ముఖ్యంగా ముస్లింలను వెనక్కి పంపించడం కోసమే అస్సాంలో 'నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజెన్స్ (ఎన్ఆర్సీ)' నిర్వహించిన విషయం తెల్సిందే. వలసవచ్చిన వారిని పక్కన పెడితే స్థానిక భారతీయులు కూడా తమ పౌరసత్వాన్ని నిరూపించుకోలేక పోవడం వల్ల అస్సాంలో ఎన్ఆర్సీ వివాదాస్పదమైంది.దేశవ్యాప్తంగా ఎన్ఆర్సీ కార్యక్రమాన్ని చేపడతామంటూ అమిత్ షా ప్రకటించిన వెంటనే తమ రాష్ట్రంలో మాత్రం అందుకు అనుమతించే ప్రసక్తే లేదని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ హెచ్చరించారు. ఎన్ఆర్సీ కారణంగానే తాను ఓడిపోయినట్లు కలియాగంజ్ నుంచి పోటీ చేసిన బీజేపీ అభ్యర్థి కమల్ చంద్ర సర్కార్ తెలిపారు. అస్సాంలో నిర్వహించిన ఎన్ఆర్సీ వేరు, దేశవ్యాప్తంగా నిర్వహించే ఎన్ఆర్సీ వేరని చెప్పడంలో, ఎన్ఆర్సీ కేంద్ర ప్రభుత్వ కార్యక్రమమని, బీజేపీకి సంబంధం లేదని వివరించడంలో విఫలం అవడం వల్లనే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆయన అన్నారు. మూడు చోట్ల తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థులను అఖండ మెజారిటీతో ఓటర్లు గెలిపించడంపై దీని ప్రభావం ఉందని భావిస్తున్నారు.

## మహిళల రక్షణ కోసం ప్రత్యేక ఫోన్ నంబర్లు

### ఆహ్వానించిన నెటిజన్లు

హైదరాబాద్,నవంబర్30(ఆర్ఎన్ఎ): మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాల నుండి రక్షణ కల్పించేందుకు రాచకొండ పోలీసు కమిషనరేట్ పలు ఫోన్ నెంబర్లను జారీ చేశారు. రాత్రి వేళల్లో ప్రయాణించే మహిళలు తమ వాహనాలు చెడిపోయినా పంక్చర్ అయినా ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే తమను సంప్రదించాలంటూ పలు ఫోన్ నెంబర్లను జారీ చేశారు. ఇక రాచకొండ కమిషనరేట్ తీసుకున్న ఈ నిర్ణయానికి కొంతమంది హర్షం వ్యక్తం చేస్తుండగా హైదరాబాద్, సైబరాబాద్ కమిషనరేట్ కార్యాలయాలు కూడా ఇదే విధానాన్ని అమలు చేస్తే బాగుంటుందని మరికొంతమంది తమ అభిప్రాయాలను సోషల్ మీడియా వేదికగా తెలియజేస్తున్నారు. మహిళలందరు తెలంగాణ డిజిపి అఫీషియల్ ట్విట్టర్‌కు వెళ్లి ఆ ఫోన్ నెంబర్లను సేవ్ చేసుకోవాలని కోరుతున్నారు.

## సామాజిక తెలంగాణ కోసం పోరు: సిపిఎం

సంగారెడ్డి,నవంబర్30(నేటినిజం ప్రతినిధి):సామాజిక తెలంగాణ కోసం రాష్ట్రంలో మరో పోరాటానికి శ్రీకారం చుడతామని సీపీఎం జిల్లా కార్యదర్శి బి.మల్లేశం అన్నారు. దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతులు, కార్మికులు, కూలీలు, మహిళలు, విద్యార్థులు, వృద్ధులు, యువకులు, వికలాంగులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తామని వెల్లడించారు. జీఎస్‌టీ పేరుతో పేద ప్రజలపై భారం మోపుతున్నారని అన్నారు. అలాగే టీఆర్ఎస్ ప్రభుత్వం కాంగ్రెస్ విధానాలనే అవలంబిస్తూ రైతులను మోసం చేస్తోందన్నారు. రైతులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని

తెలిపారు. డబుల్ బెడ్ రూం ఇళ్లు, దళితులకు మూడెరాల భూపంపిణీ, రైతుల రుణ మాఫీల్లో ప్రభుత్వం విఫలం చెందిందన్నారు. బీజేపీ ప్రభుత్వం ఆరెస్సెస్ చేతిలో కీలు బొమ్మగా మారి దేశంలో మత ఘర్షణలు సృష్టిస్తోందని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యాయని అన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించాలని సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేస్తోంటే బీజేపి ప్రభుత్వం సీపీఎం కార్యాలయాలపై దాడులకు పాల్పడుతోందని అన్నారు.

## ఎయిడ్స్ అవగాహన కార్యక్రమాలు

వరంగల్,నవంబర్30(ఆర్ఎన్ఎ): ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా డిసెంబర్ 1న పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వరంగల్ అర్బన్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తెలిపారు. ఎయిడ్స్‌పై ప్రజల్లో చైతన్య కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని అన్నారు. వరంగల్ అర్బన్, రూరల్ వైద్య ఆరోగ్యశాఖల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని సూచించారు. ఇదిలావుంటే ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలో ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎయిడ్స్ రోగులకు సేవలందిస్తున్న వైద్య సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు ఆ రోజున అవార్డులు ప్రదానం చేయనున్నట్లు వివరించారు. జిల్లా కేంద్రంలోని ఏరియా ఆసుపత్రి ఎయిడ్స్ చికిత్స కేంద్రంలో వైద్య సేవలందుకుంటున్న వ్యాధిగ్రస్థులకు మెరుగైన సేవలందించడానికి వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని సూచించారు. ఎయిడ్స్‌పై ప్రజలు అవగాహన సెంచుకోవాలన్నారు.

## ఆరుతడి పంటలకు ప్రాధాన్యం

నిజామాబాద్,నవంబర్30(ఆర్ఎన్ఎ): చెరువులు, కుంటల్లో సమృద్ధిగా నీరున్నందున రైతులు పూర్తిగా వరిసాగుకే మొగ్గు చూపుతున్నారని జిల్లా వ్యవసాయాధికారి అన్నారు. అయితే నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. రైతులు ఆరుతడి పంటలను సాగు చేయాలని తెలిపారు. రబీ సీజన్‌లో రైతులకు అన్నిరకాల విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచామన్నారు. జిల్లాలో ఎరువులు, విత్తనాలకు కొరత రాకుండా పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచామని తెలిపారు. రైతులకు వరి, మొక్కజొన్న, కందిపంటల యాజమాన్య పద్ధతుల గురించి అవగాహన కల్పించారు.

## నేడు ఎయిడ్స్ అవగాహన ర్యాలీలు

హైదరాబాద్,నవంబర్30(ఆర్ఎన్ఎ): ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలో అనేకకార్యక్రమాలు చేపట్టారు. ఎయిడ్స్ అవగాహన ర్యాలీలు చేపట్టనున్నారు. అవగాహనతోనే ఎయిడ్స్ దూరం చేయవచ్చన్నారు. ఎయిడ్స్‌తో బాధపడుతున్న వారిని ఆదరించాలని, ఈ వ్యాధిపై ప్రజల్లో మరింత అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని అన్నారు. ఎయిడ్స్ బాధితులు రోజురోజుకు తగ్గుతున్నారని 2020 నాటికి 90శాతం తగ్గించాలన్నారు. స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వాలు అన్ని సంస్థలు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నివారణ సంస్థ టీసాక్స్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్‌లో రక్త సమాచారాన్ని ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తెస్తామని ఎయిడ్స్ సంస్థ అధికారులు అన్నారు.




## కిలో 35కే ఉల్లిపాయల విక్రయం

### ఎగబడి కొంటున్న బీహార్ ప్రజలు

పాట్నా,నవంబర్30(ఆర్ఎన్ఎ): ఉల్లిగడ్డల ధర ఆకాశాన్నంటడంతో బీహార్ ప్రభుత్వం కిలో ఉల్లిగడ్డలను 35కే సబ్సిడీపై ఇవ్వాలని నిర్ణయించింది. దీంతో ఆ రాష్ట్రంలో ఉల్లిని కొనేందుకు జనం ఎగబడుతున్నారు. భారీ క్యూలైన్లు కడుతున్నారు. పాట్నాతో పాటు ఇతర నగరాల్లో ఉల్లిగడ్డలను కొనేందుకు ఉదయమే జనం బారులు తీరారు. ఆ రాష్ట్ర సహకార మార్కెటింగ్ సంస్థ ఉల్లిగడ్డలను కిలో 35 రూపాయలకు అమ్ముతున్నది. దీంతో జనం ఎగబడుతున్నారు. దేశ వ్యాప్తంగా ఉల్లిపాయలకు భారీగా డిమాండ్ పెరిగింది. కిలో ఉల్లిపాయలను రూ. 100కు అమ్ముతున్నారు. కొన్ని రాష్ట్రాల్లో అయితే ఆయా ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఉల్లిపాయలను విక్రయిస్తున్నారు. బీహార్ స్టేట్ కోఆపరేటివ్ మార్కెటింగ్ యూనియన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆ రాష్ట్ర ఉల్లిపాయ కౌంటర్లను తెరిచారు. ఈ కౌంటర్ల వద్ద గృహిణులు బారులు తీరారు. కిలో ఉల్లిపాయలను రూ. 35కు అమ్ముతున్నారు. అయితే కొందరు దుండగులు ఉల్లిపాయలను విక్రయించే వారిపై రాళ్లు విసిరి దాడులు చేస్తున్నారు. వారి నుంచి రక్షణ పొందేందుకు తలకు హెల్మెట్ ధరించి ఉల్లిపాయలను విక్రయిస్తున్నామని అధికారులు తెలిపారు. తమకు ప్రభుత్వం ఎలాంటి రక్షణ కల్పించలేదు.. అందుకే ఈ మార్గాన్ని ఎంచుకున్నామని అధికారులు స్పష్టం చేశారు.

## రాజకీయ అస్థిరతకు బిజెపి యత్నం

### –మండిపడ్డ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్

హైదరాబాద్,నవంబర్29(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో గందరగోళం సృష్టించడానికి విపక్షాలు కుట్రలు చేస్తున్నాయని ప్రభుత్వ విప్ కర్నె ప్రభాకర్ అన్నారు. రాష్ట్రంలో రాజకీయ అస్థిరతకు బీజేపీ ప్రయత్నిస్తోందన్నారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. దేశంలోనే అద్భుతమైన రాష్ట్రంగా తెలంగాణను సీఎం కేసీఆర్ తీర్చిదిద్దుతున్నారన్నారు. ప్రజల్లో సీఎం కేసీఆర్‌కు పెరుగుతున్న ఆదరణను చూసి విపక్షాలు ఓర్వలేక పోతున్నాయని మండిపడ్డారు. ఆర్టీసీ కార్మికుల విషయంలో సీఎం కేసీఆర్ పెద్ద మనసుతో నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కాగా బీజేపీ నేతలు దివాళాకోరు మాటలు మాట్లాడుతున్నారన్నారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధుల గురించి మాత్రం బీజేపీ నేతలు నోరు మెదపరని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో బాల మల్లు, శుభప్రద్ పటేల్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

## తెలంగాణ ఖ్యాతిని ఇనుమడింప చేయాలి

### –క్రీడాకారులకు వినోద్ సూచన

హైదరాబాద్,నవంబర్30(ఆర్ఎన్ఎ): జాతీయస్థాయి క్రీడల్లో ప్రతిభను చాటి తెలంగాణ ఖ్యాతిని మరింత ఇనుమడింప జేయాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్ పిలుపునిచ్చారు. క్రీడాకారులు తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శించాలని వినోద్ కుమార్ సూచించారు. శుక్రవారం మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని జబల్పూర్ నగరంలో జరిగిన ఓ కార్యక్రమంలో వినోద్ కుమార్ పాల్గొన్నారు. త్వరలో జరుగనున్న 65 వ నేషనల్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో తెలంగాణ క్రీడాకారులు అన్ని విభాగాల్లో రాణించాలని వినోద్ కుమార్ ఆకాక్షించారు. క్రీడలను ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోందని ఆయన పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనేందుకు తెలంగాణ రాష్ట్రం నుంచి ముగ్గురు ఎంపికవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. జబల్పూర్ లో శుక్రవారం తనను కలిసిన ముగ్గురు కరాటే క్రీడాకారులను వినోద్ కుమార్ అభినందించారు. 14 సంవత్సరాల వయస్సు విభాగంలో బీ. నమ్రత, టీ. సిద్దార్థ్, 17 సంవత్సరాల విభాగంలో టీ. ఉదయ్ ఎంపిక కావడంతో వారికి వినోద్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరాటే కోచ్ అబ్దుల్ బాఖి పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com